
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



శనివారం 31 మే 2025



కాటాను, ఈపాస్ యంత్రానికి ఆన్‌లైన్ అనుసంధానం చేస్తున్న తూ.కొ అధికారులు

ఇంకెన్నాళ్లు ఫ్రీ హోల్డ్!


14,834 ఎకరాలకు నిబంధనలకు విరుద్ధంగా హక్కులు

- ఆ భూములపై విచారణ జరిగి ఆరు నెలలు
- వైసీపీ హయాంలో పేదల ముసుగులో పెద్దల దోపిడీ
- గ్రామసభలు లేకుండానే అసైన్‌మెంట్ భూముల ఫ్రీహోల్డ్
- భారీ అవినీతి బయటపడ్డా చర్యలు తీసుకోవడంలో జాప్యం

గత వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీకావు. ముఖ్యంగా భూముల విషయంలో అక్రమాలు తారస్థాయికి చేరాయి. భూ పంపిణీ మొదలు అసైన్‌మెంట్ భూములకు హక్కులు కల్పించడం (ఫ్రీహోల్డ్) వరకూ భారీ ఎత్తున తప్పులు జరిగాయి. పేదల ముసుగులో పెద్దలు దోపిడీకి పాల్పడ్డారు. ఒక్క నెల్లూరు జిల్లాలో దాదాపు 14,834 ఎకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు తేలింది. ఇలా అక్రమాలు బయటపడి ఆరు నెలలు గడిచినా ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసం రెవెన్యూ అధికారులు ఎదురుచూస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)





వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ పేరుతో ఒక జీవోను తీసుకొచ్చింది. దీని ప్రకారం ఎవరైతే అసైన్‌మెంట్ పట్టాలు పొంది 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారో.. అటువంటి వారికి ఆ అసైన్‌మెంట్ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తారు. అలానే చుక్కల భూములకు కూడా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. ఇలా గత ప్రభుత్వంలో జిల్లాలో 98,785 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. అందులో అసైన్‌మెంట్ భూములు 55,447 ఎకరాలు ఉండగా, చుక్కల భూములు 43,271 ఎకరాలు ఉంది. మరో 67 ఎకరాలు ఈనాం భూములున్నాయి. నిబంధనల ప్రకారం ఫ్రీహోల్డ్ చేసే సమయంలో గ్రామ సభలు నిర్వహించాలి. అప్పుడే లబ్ధిపొందుతున్న వ్యక్తి అర్హుడా.. కాదా..? అన్నది తేలిపోతుంది. కానీ నిజమైన అసైన్‌మెంట్‌దారులు కాకపోయినా వేల మందికి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించి పేదల భూములు కట్టబెట్టారు. ఈ అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక విచారణకు ఆదేశించింది. గతేడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో ఫ్రీహోల్డ్ భూములపై తహసీల్దార్ల స్థాయిలో క్షేత్రస్థాయి విచారణ జరిగింది. ఈ సందర్భంగా 14,834 ఎకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసి అనర్హులకు దోచిపెట్టినట్లు తేలింది. ఇందులో అసైన్‌మెంట్ భూములు 14,553 ఎకరాలు, చుక్కల భూములు 281 ఎకరాలు ఉన్నాయి. ఈ వివరాలన్నిటినీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేశారు. అనంతరం అన్ని వివరాలను ఆన్‌లైన్ చేశారు.

● నిజమైన అర్హులకు అన్యాయం

ఇంత భారీస్థాయిలో ప్రభుత్వ భూములను అనర్హులకు కట్టబెడుతూ ఫ్రీహోల్డ్ కల్పించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ప్రక్రియలో భాగమైనా నాటి రెవెన్యూ అధికారులు అవినీతిలో కీలకంగా వ్యవహరించారు. అప్పటి వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పేదల భూములను పెద్దలకు కట్టబెట్టారు. అయితే ఈ అక్రమాలన్నీ విచారణలో బయటపడ్డప్పటికీ చర్యలు తీసుకోవడంలో మాత్రం జాప్యం జరుగుతోంది. ఆరు నెలలు గడిచినా ఇంత వరకూ ఫ్రీహోల్డ్ భూములపై ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న స్పష్టత ప్రభుత్వం నుంచి రాలేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. కాగా, విచారణ నేపథ్యంలో ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. గడిచిన ఆరు నెలలుగా ఈ ఉత్తర్వులను పొడగిస్తూ వస్తోంది. తాజాగా మరో రెండు నెలలు ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధాన్ని పొడిగించింది. ఈ ప్రక్రియతో నిజమైన అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. వారి భూము లు కూడా రిజిస్ట్రేషన్ జరగకపోతుండటంతో అవసరానికి అమ్ముకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం త్వర గా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

ఫ్రీహోల్డ్ భూములపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక పంపాం. గుర్తించిన లోటుపాట్లను అందులో పేర్కొన్నాం. మొత్తం వివరాలను పారదర్శకంగా ఆన్‌లైన్ చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. ఫ్రీహోల్డ్ భూములపై నిషేధం కొనసాగుతోంది.

- కే కార్తీక్, ఇన్‌చార్జి కలెక్టర్

అన్నీ కరెక్ట్‌గా ఉన్నాయా!?

'ఈ కాటా నీదేనా.. కరెక్ట్‌గా ఉందా!? ఏదైనా సమస్య ఉందా!? ఈ-పాస్ యంత్రం పని చేస్తోందా!? రెండింటికీ ఆన్‌లైన్ అనుసంధానం ఉందా!?' ఇలా తూనికలు, కొలతల శాఖ అధికారులు రేషన్ డీలర్ల వద్ద వాకబు చేశారు. ఆదివారం నుంచి నిత్యావసర సరుకులు డీలర్ల వద్దే ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ముందస్తుగా తూ.కొ శాఖ అధికారి జావీద్ శుక్రవారం మనుబోలు మండలంలోని కాటాలను, ఈ-పాస్ యంత్రాలను పరిశీలించారు. మూలన పడిన వాటికి సాంకేతిక సిబ్బంది ద్వారా మరమ్మతులు చేయించారు. అలాగే ఆన్‌లైన్ అనుసంధానమూ చేస్తున్నారు. ఇందుకోసం మండలంలోని 28మంది డీలర్లు కాటాలను, ఈపాస్ యంత్రాలు తీసుకువచ్చారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

1 నుంచి దుకాణాల్లోనే రేషన్

నెల్లూరు (హరనాథపురం) : జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల వద్దే కార్డుదారులకు బియ్యం, చక్కెర ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 65 సంవత్సరాలు పైబడిన కార్డుదారులు, దివ్యాంగులకు మాత్రం ఇళ్ల వద్దనే ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆదివారాల్లో కూడా రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు.

ఆ ఇద్దరు విద్యార్థులకు మార్కులు పెరిగాయ్!

జవాబుపత్రాల ట్యాంపరింగ్ వ్యవహారంపై ఇంటర్ బోర్డు సీరియస్

కందుకూరు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఇంటర్మీడియట్ జవాబుపత్రాలను ఇన్విజిలేటర్ ట్యాంపరింగ్ చేసిన అంశంపై ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. పరీక్షాపత్రాల రీ వెరిఫికేషన్‌లో ట్యాంపరింగ్ నిజమని నిర్ధారించుకున్న ఇంటర్‌బోర్డు కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు వారిద్దరికీ మార్కులు కలిపి సవరించిన మార్కుల సర్టిఫికెట్లను జారీచేశారు.

- వివరాలు 6లో..



ట్రంకురోడ్డుపై వర్షపు నీరు



పొగతోటలో మురుగు కాలువను తలపిస్తున్న రోడ్డు

నగరంలో భారీ వర్షం

నెల్లూరు (సిటీ), మే 30 (ఆంధ్రజ్యోతి) : రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరులో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం నగరవాసులను ఇబ్బందులకు గురిచేసింది. గాంధీబొమ్మ కూడలి, ఆర్టీసీ, వీఆర్సీ జంక్షన్‌లతోపాటు ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్‌గేట్, రామలింగాపురం, మాగుంట లేఅవుట్ ప్రాంతాలలోని అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంరాయం ఏర్పడింది. ఇటు గాలులు తోడవడంతో అక్కడక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే, అధికార యంత్రాంగం వెంటనే రంగంలోకిదిగి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో, అధికారులు



ఉత్సవాల్లో అన్ని వసతులు కల్పిస్తాం

- మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు
- వెంగమాంబ ఆలయాభివృద్ధికి కృషి
- సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సురేష్

■ 6లో...



పొగ కబళిస్తోంది!

సరదాకనో.. లేదా ఒత్తిడి తగ్గించుకునేందుకనో మరేకారణాలతోనో అలవాటవుతున్న ధూమపానం చివరకు దానికి బానిసలుగా మారిపోతున్నారు. సిగరెట్.. గుట్కా.. పాన్.. కొన్ని రకాల కిళ్లీలు.. ఇలా పొగాకు ఉత్పత్తులు మనిషి మనుగడకే ప్రమాదకరంగా మారుతున్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా బాలురు సైతం ఈ పొగాకుకు బానిసలు మారి మృత్యువుకు చేరువ అవుతున్నారు. ధూమపానం సేవించే వారిలో 80 నుంచి 90 శాతం మంది ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. జిల్లా జనాభాలో 8 లక్షల మందికిపైగా పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తున్నట్లు అంచనా. సంవత్సరానికి సుమారు రూ.1,320 కోట్ల వ్యాపారం జిల్లాలో పొగాకు వ్యాపారం జరుగుతోందంటే వినియోగం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పొగాకు నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువస్తున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ప్రత్యేక కథనం...

6 లో..

పొగాకుతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

గుండె, ఊపిరితిత్తుల పైనే ఎక్కువ

జిల్లాలో ఏటా 2 వేల మందికిపైగా మృతి

వైద్యుల హెచ్చరికలు డోంట్‌కేర్..

ఏటా రూ.1,320 కోట్ల వ్యాపారం

నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

ఎన్డీసీఎంఎస్, డీసీసీబీ

ఛైర్మన్ల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నెల్లూరు (హరనాధపురం) మే 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఎన్డీసీఎంఎస్), నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు (డీసీసీబీ) ఛైర్మన్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్డీసీఎంఎస్ ఛైర్మన్‌గా గంగోలు నాగేశ్వరరావును, ఎన్‌డీసీసీబీ ఛైర్మన్‌గా మెట్టుకూరు ధనుంజయరెడ్డిని నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. కాగా, వెంకటగిరికి చెందిన గంగోలు నాగేశ్వరరావు గతంలో స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, పెంచలకోన ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా పని చేశారు. ఇక అనంతసాగరం మండలం లింగంగుంటకు చెందిన మెట్టుకూరు ధనుంజయరెడ్డి 2013- 19 మధ్య ఎన్‌డీసీసీబీ ఛైర్మన్‌గా పనిచేశారు. అయితే ఒక ఛైర్మన్‌తోపాటు ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం ఆనవాయితీ. కాగా, ప్రస్తుతం ఛైర్మన్లను పర్సన్ ఇన్‌చార్జ్‌గా పేర్కొంటూ జీవో విడుదల చేయడం గమనార్హం

విద్యుత్ కొరత, పెరుగుతున్న వినియోగం, అధిక బిల్లుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది. సూర్య ఘర్ పీఎం పథకం ద్వారా వినియోగదారుల ఇళ్లపై సోలార్ పలకల ఏర్పాటుకు సంకల్పించింది. ఎంతో మహోన్నత ఆశయంతో ప్రవేశపెట్టిన ఈ పథకంపై వినియోగదారుల్లో స్పందన కరువవుతోంది. జిల్లాలో దాదాపు పది లక్షలకుపైగా విద్యుత్ సర్వీసులు ఉండగా కేవలం 2 వేల దరఖాస్తులు మాత్రమే అందాయి. వీటిలో 1,400 ఇళ్లపై సోలార్ పలకలు అమర్చారు.



పలకరేం!

- సోలార్ విద్యుత్‌కు స్పందన కరువు
- ఉన్న సర్వీసులు 10 లక్షలపైనే.. వచ్చిన దరఖాస్తులు 2 వేలే
- వీటిలో 1,400 సోలార్ ప్యానళ్ల ఏర్పాట్లు
- వినియోగదారుల నుంచి కానరాని స్పందన

నెల్లూరు (జడ్పీ), మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోలార్ విద్యుత్ కోసం ఇప్పటిదాకా కేవలం 1400 కనెక్షన్లు మాత్రమే వినియోగదారులు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా గృహాలు, వాణిజ్యానికి సంబంధించి 8.36 లక్షలు, వ్యవసాయానికి 1.3 లక్షల సర్వీసులు ఉన్నాయి. ఈ వినియోగదారులకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించి, కనెక్షన్లు విస్తృతంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించింది. అయితే దీనిపై వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటివరకు కేవలం 2 వేల మేర దరఖాస్తులు రాగా అందులో 1400 వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గృహాలు, వాణిజ్య సముదాయాలతోపాటు వ్యవసాయానికి, ప్రభుత్వ కార్యాలయాలకు, వీదిలైట్లు, తాగునీటి సరఫరాకు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు భారీగా తగ్గుతాయి. అయితే ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. దీంతో సోలార్ పలకలకు అయ్యే ఖర్చు ఎవరు భరిస్తారన్న దానితో ప్రభుత్వ కార్యాలయాలు ముందుకు రావడం లేదు.

● సబ్సిడీ ఇలా...

ఒక కిలోవాట్ సోలార్ ఏర్పాటుకు రూ.70 వేల నుంచి 80 వేల వరకు ఖర్చు అవుతుంది. రెండు కిలోవాట్స్‌కు రూ.1.30 లక్షల నుంచి 1.40 లక్షల వరకు, మూడు కిలోవాట్స్‌కు రూ.2.10 లక్షల నుంచి 2.20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇం దులో కేంద్ర ప్రభుత్వం ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్స్‌కు రూ.60 వేలు, మూడు కిలోవాట్స్ రూ.78 వేలు చొప్పున సబ్సిడీ మంజూ రు చేస్తుంది. అలాగే వినియోగదారుడు మొత్తం సొమ్ము ఒకేసారి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాన్ని ప్రభుత్వమే కల్పిస్తుంది. నాలుగేళ్లలో సులభతర వాయిదాలలో తిరిగి రుణాన్ని చెల్లించే వెసులుబాటు ఉంటుంది.

● విద్యుత్ శాఖ మాత్రమే ప్రచారం

అనుకున్న ప్రకారం జిల్లాలో సోలార్ పలకలు ఏర్పాటు చేయాలంటే అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సమిష్టిగా వినియోగదారులలో అవగాహన తీసుకురావాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. అయితే, విద్యుత్ శాఖ తప్ప పాలకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఇతర శాఖల అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదనే అపవాదు ఉంది.

● ఎస్సీ, ఎస్టీ ఇళ్లకు ఏవీ!?

జిల్లాలో ఉచితంగా విద్యుత్‌ను అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల ఇళ్లకు సూర్యఘర్ పీఎం పథకం ద్వారా సోలార్ పలకలను ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీల కాలనీలకు చెందిన 50 వేల ఇళ్లకు అధికారులు రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే ఇంతవరకు వాటికి కూడా సోలార్ పలకలు ఏర్పాటు చేయలేదు. దీంతో జిల్లాలో సోలార్ విద్యుత్‌కు స్పందన పూర్తిగా కరువై ఉంది.

10 వేల కనెక్షన్లు ఇవ్వనున్నాం

సోలార్ పలకల ఏర్పాటుపై వినియోగదారులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాము. అయినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావడం లేదు. మరింత శ్రద్ధ పెట్టి తొలివిడతలో 10 వేల కనెక్షన్లు ఇచ్చేలా ప్రయత్నిస్తున్నాము.

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

ఫసల్ ధీమా..!

పంట నష్టం నుంచి రైతులకు ఊరట

ఖరీఫ్‌లో వరి, వేరుశనగ పంటలకు బీమా ● పీఎంఎఫ్‌బీవై ద్వారా అమలు



నెల్లూరు(వ్యవసాయం), మే 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పంటలు విపరీతంగా దెబ్బతింటుంటాయి. దిగుబడులు తగ్గినప్పుడు కూడా రైతులకు కనీసం పెట్టుబడి కూడా దక్కని పరిస్థితులు నెలకొంటాయి. దీంతో రైతులు ఆర్థికంగా కుదేలైపోతున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, అప్పులిచ్చిన వారు ఇంటి చుట్టూ తిరుగుతుంటే అవమానంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నాం. ఇలాంటి వాటి నుంచి రైతులకు ఊరట కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. అందులో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎం ఎఫ్‌బీవై) ఒకటి. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాలో కొంత మొత్తాన్ని బీమా సంస్థకు చెల్లించేందుకు నిర్ణయం కూడా తీసుకుంది.

వరి, వేరుశనగ పంటలకు వర్తింపు

ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారంగా సీజన్ల వారీగా వివిధ పంటలను నోటిఫై చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి, వేరుశనగ పంటలకు, అదేవిధంగా రబీ సీజన్‌కు వరి, మినుము, శనగ, పెసర, వేరుశనగ పంటలకు బీమా సౌకర్యం కల్పించారు. వరి పంటను గ్రామం యూనిట్‌గా, మినుము, శనగ పంటలకు మండలం యూనిట్‌గా, పెసర, వేరుశనగ పంటలకు జిల్లా యూనిట్‌గా పరిగణలోకి తీసుకుంటారు. జిల్లాలో టాటా జీఏసీ ఇన్సురెన్సు కంపెనీ ఈ బీమా పథకాన్ని అమలు చేసే ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. పంట రుణాలు తీసుకున్నవారికి బ్యాంకు అధికారులే ఆయా పంటలకు బీమా చెల్లింపులు చేస్తారు. రుణాలు తీసుకోని రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, కామన్ సర్వీస్ సెంటర్లు, మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. బీమా నమోదుకు ఆధారుకార్డు, పట్టాదారు పాసుపుస్తకం, 1బీ అడంగల్, కౌలురైతు గుర్తింపు కార్డు, ఈ-పంట నమోదు, బ్యాంకు ఖాతా నెంబరు పత్రాలు అవసరం.

ప్రీమియం చెల్లింపులు ఇలా..

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఏప్రిల్ నుంచి నుంచి ఫసల్ బీమా యోజన కింద నమోదు చేయించుకునే అవకాశం కల్పించారు. ఎకరా వరి పంటకు రైతు బీమాగా రూ.168, వేరుశనగకు రూ.60 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. దిగు బడుల్లో వ్యత్యాసం కనిపిస్తే బీమా కింద వరికి ఎకరాకి రూ.42వేలు, వేరుశనగర పంటకు ఎకరాకు రూ.30వేలు నష్టపరి హారంగా చెల్లిస్తారు. ప్రీమియం చెల్లింపు లకు సంబంధించి ఇంకా సమ యం ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకో వాల్సిన అవసరం ఉంది.

రంగులరాట్నం ఏర్పాటుకు 5న వేలం

విడవలూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థంలో వెలసి ఉన్న రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భగా దేవాలయ ప్రాంగణంలో రంగులరాట్నం ఏర్పాటుకు జూన్ నెల 5వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో నిర్వహించిన వేలం పాటలో దీనికి సంబంధించి వాయిదా పడిదని తెలిపారు. పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.50వేలు ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9188
వెండి కిలో ధర	రూ. 99,500
వెండి ఒక గ్రాము	రూ. 102.50



నేరాల నియంత్రణకు

ప్రత్యేక నిఘా

● పోతుగుంట సుబ్బారావు, సీఐ

వెంకటాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు సీఐ పోతుగుంట సుబ్బారావు తెలిపారు.

? జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఏమి చర్యలు చేపడుతున్నారు.

! అతివేగం, అవగాహన లోపంతో జరుగుతున్న ప్రమాదాల నివారణకు ర్యాలీలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నాం.

? చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా.

! చోరీలు, అత్యాచారాలు, మాదక ద్రవ్యాల వాడకం నిషేధం వంటి అంశాలపై గ్రామాల్లో యువత, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. చట్టాల గురించి సమగ్రంగా వివరించి శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తున్నాం.

? గతంలో జరిగిన వరుస చోరీలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! గతంలో పలు గ్రామాల్లో వరుస చోరీలు జరిగాయి. వాటి నియంత్రణకు సిబ్బంది ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

? డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్లు వాహనాల వాడకంపై చర్యలు తీసుకుంటున్నారా.

! డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నాం. మైనర్లు వాహనాలు నడపడంపై వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ వంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

? శాంతిభద్రతల పరిరక్షణ, జూదాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పేకాట, కోడి పందేలు, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాం.

నిత్యాన్నదానానికి విరాళం



ఆలయ అధికారులకు నగదు అందచేస్తున్న శంకర్రావు

రాపూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన దేవస్థానంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా బద్వేల్‌కు చెందిన గాజులపల్లి శంకర్రావు, శ్రీదేవి దంపతులు లక్ష రూపాయల నగదును శుక్రవారం విరాళంగా ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులరెడ్డికి అందించారు. అనంతరం ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లుచేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

'అపోలో'లో నోటి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

నెల్లూరు (వైద్యం), మే 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అపోలో ఆసుపత్రిలో శనివారం నోటి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ వెల్లడించారు. శుక్రవారం ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ జీవీవీ ప్రసాద్, డాక్టర్ హరిత, ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు.

ముంపు నీరు వెళ్లే మార్గమేదీ ?

● తూటాకుమయంగా బుడ్డి డ్రైన్ ● ఆపై ఆక్రమణల జోరు

ముత్తుకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రెండు మండలాల్లో పొలాలు ముంపునకు గురికాకుండా కాపాడే బుడ్డి డ్రైన్ తూటాకుతో పూడిపోయింది. నెల్లూరు రూరల్, ముత్తుకూరు మండలాల్లో 60 గ్రామాలకుపైగా బుడ్డి డ్రైన్ ద్వారా ముంపు నీటి నుంచి రక్షణ కలుగుతోంది. ఈ డ్రైన్ ప్రాధాన్యతను గుర్తించి 1996లో బుడ్డి డ్రైన్ అభివృద్ధికి నాటి సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భూములను సేకరించి అభివృద్ధి చేయించారు. పదేళ్ల కిందట పూడిపోయిన బుడ్డి డ్రైన్ మరమ్మతులను చేపట్టారు. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ డ్రైన్‌ను పట్టించుకోకపోవడంతో తూటాకుతో, ముళ్ల చెట్లతో నిండిపోయింది. వర్షాకాలంలో ముంపు నీరు వెళ్లేందుకు మార్గం లేని దుస్థితి ఏర్పడింది.

● వైసీపీ నేతల ఆక్రమణలు

కొన్ని ప్రాంతాల్లో డ్రైన్ పక్కనే పొలాలు ఉన్న వైసీపీ నాయకులు ఇష్టారీతిన ఆక్రమించుకోవడంతో కుచించుకుపోయింది. వర్షాలతో పొలాలు ముంపునకు గురవకుండా కాపాడాల్సిన డ్రైన్ తూటాకుతో నిండి పచ్చటి పొలాలను తలపిస్తోంది. కాకుపల్లి సమీపంలోని కాకి చెరువు నుంచి పలు గ్రామాల మీదుగా ముంపు నీటిని నేలటూరు చెరువుకు చేరుస్తుంది. అయితే ప్రస్తుతం తూటాకుతో



తూటాకుతో పూడిపోయిన బుడ్డి డ్రైన్

పూడిపోవడంతోపాటు ఆక్రమణలతో కుంచించుకుపోయిన బుడ్డి డ్రైన్ ముంపు నీటిని తరలించలేని దుస్థితికి చేరుకుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బుడ్డి డ్రైన్ మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోదీ : సీఐటీయూ

ముత్తుకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను కాలరాసేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని సీఐటీయూ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు జయశంకర్ విమర్శించారు. ఏపీ జెన్కో థర్మల్ కేంద్రం ఎదుట శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ జెన్కోలో కార్మికుల సమస్యలపై 44 రోజులపాటు ఆందోళన నిర్వహిస్తే, సమస్యలను పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్, సీఐటీయూ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, సీపీఎం నాయకులు గోగుల శ్రీని వాసులు, సుమన్, పట్టపు రామయ్య, గడ్డం అంకయ్య, చీకిరి ఆదిశేషయ్య, స్వర్ణ రమణారావు పాల్గొన్నారు.

వరి ధాన్యానికి కనీస మద్దతు ధర పెంచాలి



మాట్లాడుతున్న టీడీపీ నేత చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి

కోవూరు, మే, 30 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యానికి కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం మరింతగా పెంచాలని టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది వరిసాగుకు ఎకరాకు రూ 30 వేలు ఖర్చయిందని, ఈ ఏడాది పెరిగిన ఎరువులు, పురుగు మందుల ధరల వల్ల రూ.40,000 కానుందని చెప్పారు. వరి ధాన్యానికి కనీస మద్దతు ధరను క్వింటంకు కనీసం రూ.300లకు పెంచాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అధిక దిగుబడి వచ్చే వరి వంగడాలు వేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

విడవలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులు వచ్చే వరి వంగడాలను సాగు చేస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయని ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని చౌకిచర్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భూసార పరీక్షలు చేసుకుని అందుకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు వాడుకోవాలన్నారు. దీనివలన రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గి లాభాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు లోకేష్‌బాబు, శ్రీలక్ష్మి, వ్యవసాయాధికారి కృష్ణయ్య, రైతులు పోలిరెడ్డి ఆశోక్ రెడ్డి, సమాది శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి

వడాయతీ ఉత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో బ్రహ్మోత్సవాలు అనంతరం 5 రోజులపాటు జరిగే వడాయతీ ఉత్సవం 3వ రోజు శుక్రవారం రాత్రి మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలకు వైభవంగా నిర్వహించారు. ఆలయ కుంభ హారతి మండపంలో ఏర్పాటు చేసిన ఊయలలో స్వామి, అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు అనంతరం ఊయలసేవ నిర్వహించారు. ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ముందుగా స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, పల్లకిసేవలతోపాటు వడాయతీ ఉత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమాలను ఆలయ సేవాకమిటీ చైర్మన్ టీ.అశోక్‌కుమార్‌రెడ్డి, ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

కొత్తపాలెం కాలువలో

పూడికతీత

● రైతుల హర్షం



కొత్తపాలెం కాలువలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

తోటపల్లి గూడూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న నీటి పారుదల కాలువలో పూడికతీత పనులను శుక్రవారం అధికారులు చేపట్టారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత 30 సంవత్సరాల నుంచి కాలువలో పూడిక తీయకపోవడంతో పొలాలకు నీరు అందక రైతులు చాలా అవస్థలు పడేవారు. సమస్యను సాగునీటి సంఘం అధ్యక్షుడు చింతా సీతారామయ్య దృష్టికి రైతులు తీసుకెళ్లడంతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో కాలువలో పూడిక తీయడంతో నీరు పుష్కలంగా అందుతుంది. దీంతో సోమిరెడ్డికి రైతులు ధన్యవాదాలు తెలియజేశారు.

సోలార్ ఏర్పాటుకు సబ్సిడీ : ఈఈ

మనుబోలు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిపైన సోలార్ ఏర్పాటుచేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి కోరారు. మండలంలోని 5 విద్యుత్ సబ్‌స్టేషన్లను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బం దితో మాట్లాడారు. సమయపాలన పాటించా లని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని అందరూ వినియోగించుకోవాల న్నారు. దీనిపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నామ న్నారు. ఆక్వా రైతులు బిల్లులు సకాలంలో



మనుబోలు సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ సోమశేఖర్ రెడ్డి

చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఏఈ, అనీల్‌కుమార్, ఎల్‌ఐ. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చి : యోగాసనాలు వేస్తున్న ఏపీఎం, సీసీలు, వీవోఏలు

యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం

బుచ్చిరెడ్డిపాళెం, మే 30(ఆంధ్రజ్యోతి): నిరంతరం యోగ సాధన చేయడం వలన ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడంతోపాటు వ్యాధులను అధిగమించి ఆరోగ్యాన్ని ఉండవచ్చని హోమియోపతి వైద్యురాలు డాక్టర్ జ్ఞానప్రసూన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో శుక్రవారం బుచ్చి పట్టణంలోని మండల సమాఖ్య, వెలుగు కార్యాలయంలో ఆశాఖ ఏపీఎం, శ్రీధర్, సీసీలు, వీవోఏలకు యోగశ్వాస, యోగాసనాలు సాధన చేయించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ నుంచి యోగా మాస్టర్ల బృందం రాజేంద్రకుమార్, వెంకటలక్ష్మి, సునీత, మహిళలు పాల్గొన్నారు.

● **విడవలూరు:** ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేయటం ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో నగేష్ కుమారి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం యోగా శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యాలయ సిబ్బందితో కలసి ఎంపీడీవో యోగాసనాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయాన్నే యోగాసనాలు వేయడం వలన ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుందన్నారు. ఈ యోగా వలన అనేక రోగాలు దూరమవుతాయన్నారు. ఈ విషయాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.



విడవలూరు : యోగా చేస్తున్న ఎంపీడీవో నగేష్‌కుమారి, సిబ్బంది

రేషన్ దుకాణాల పరిశీలన



కోవూరు : పాటూరులో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు నిర్మలానందబాబ

కోవూరు, మే, 30 (ఆంధ్రజ్యోతి): జూన్ 1 నుంచి చౌక ధరల దుకాణంలో నిత్యావసర సరకులు పంపిణీ చేయనుండడంతో మండల పరిధిలోని పాటూరు, తదితర గ్రామాల్లో రేషన్ దుకాణాలను శుక్రవారం తహసీల్దారు నిర్మలానంద బాబ పరిశీలించారు. డీలర్లకు పలు సూచనలు చేశారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు సమస్యలను డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు.

● ఇందుకూరుపేట : మండలంలోని పాములవారిపాలెం, ఇందుకూరుపేట బిట్-1, చింతోపు గ్రామాల్లో చౌక ధరల దుకాణాలను తహసీల్దారు కృష్ణప్రసాద్ శుక్రవారం ఆకస్మికగా తనిఖీ చేశారు. డీలర్లు సమయపాలన పాటిస్తూ లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని, రికార్డులు సక్రమంగా ఉండేటట్లు చూసుకోవాలని పలు సూచనలు చేశారు.

నేడు ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

వెంకటాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనికేపల్లి గ్రామానికి శనివారం సాయంత్రం 4 గంటలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రానున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అనికేపల్లిలోని వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్నారని, టీడీపీ నేతలు, కార్యకర్తలు కూడా విచ్చేయాలని కోరారు.

వీఎస్‌యూ విద్యార్థికి డాక్టరేట్



దందోలు దిలీప్‌కుమార్

వెంకటాచలం, రాపూరు మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో కామర్స్ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థి దందోలు దిలీప్‌కుమార్‌కు వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పనితీరు మూల్యాంకనం అనే అంశంపై కామర్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పీ వెంకట్రావు మార్గదర్శకత్వంలో దిలీప్‌కుమార్ పరిశోధనలు నిర్వహించాడు. దీంతో శుక్రవారం వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, వర్సిటీ కావలి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ విజయ, వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ మధుమతి తదితరులు, పరిశోధన విద్యార్థులు దిలీప్‌కుమార్‌ను అభినందించారు.

పవర్‌గ్రిడ్ ద్వారా ఇంటికో చెత్తబుట్ట అందిస్తాం



పిడూరు సచివాలయానికి చెత్తబుట్టను అందిస్తున్న పవర్‌గ్రిడ్ అధికారులు

మనుబోలు, మే 30 (ఆంధ్రజ్యోతి): పవర్‌గ్రిడ్ దత్తత గ్రామమైన పిడూరులో ప్రతి ఇంటికో చెత్త బుట్టను త్వరలో అందిస్తామని కాగితాలపూరు 400కేవి పవర్‌గ్రిడ్ ఇన్‌చార్జి డీజీఎం వల్లాల అశోక్ తెలిపారు. శుక్రవారం స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమంలో భాగంగా పవర్‌గ్రిడ్ అధికారులు పిడూరు సచివాలయాన్ని సందర్శించి చెత్తబుట్టను అందచేశారు. పిడూరులో ఉన్న 650 ఇళ్ళకు చెత్త బుట్టలు పంపిణీ చేస్తామని జీఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు దినేష్‌రెడ్డి, అమిత్‌కుమార్ వశిష్ఠ, హెచ్‌ఆర్ సురోజు విజిత్‌కుమార్, ఇన్‌చార్జి సర్పంచు తిక్కవరపు వెంకటేశ్వర్లు రెడ్డి, కార్యదర్శి అంకయ్య, విఆర్‌వో శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు : ఎస్‌ఎఫ్‌ఐ

నెల్లూరు(విద్య), మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వీ నరేంద్ర ఆరోపించారు. ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు పెంచి వసూలు చేయడం సరికాదన్నారు. విద్యా సామగ్రి, యూనిఫామ్ కూడా ఆయా సంస్థలే విక్రయిస్తూ, విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మార్చాయని విమర్శించారు. అధికారులు స్పందించి విద్యాసంస్థల్లో తనిఖీలు నిర్వహించాలని, ఫీజులు నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవేంద్ర, నాని, దివేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S



రహదారిపై ట్యాంకర్‌ను ఢీకొని బోల్తాపడిన మినీ వ్యాన్

ట్యాంకర్ - వ్యాన్ ఢీ

● ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం టమోటా లోడుతో రాంగ్ రూట్‌లో వచ్చిన మినీ వ్యాన్ ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి గూడూరు వైపుగా ఆయిల్ ట్యాంకర్ వెళ్తుండగా గొలగమూడి క్రాస్ రోడ్డు నుంచి కాకుటూరు వైపుగా రాంగ్ రూట్‌లో వచ్చిన మినీ వ్యాన్ వేగంగా ఢీకొంది. దీంతో ట్యాంకర్ ముందు భాగం దెబ్బతింది. ప్రమాదానికి కారణమైన మినీ వ్యాన్ రహదారిపై బోల్తాపడింది. ఈప్రమాదంలో ట్యాంకర్‌లో ఉన్న క్లీనర్ శ్రీనాథ్‌కు గాయాలు కాగా మినీ వ్యాన్ డ్రైవర్ కూడా గాయపడ్డాడు. టమోటాల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ బోల్తాపడడంతో టమోటాలు అన్ని రోడ్డు పాలయ్యాయి. ఈప్రమాదం రహదారి మధ్యలో జరగడంతో సుమారు కిలోమీటర్‌కు పైగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న వెంకటాచలం పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. రహదారిపై ఉన్న రెండు వాహనాలను క్రేన్ సహయంతో పోలీసులు పక్కకు తొలగించారు. క్షతగాత్రులను 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

పొదలకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడేరు రోడ్డు బస్ షెల్టర్ వద్ద శుక్రవారం నక్కా లక్ష్మమ్మ (58) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సమాచారం అందుకున్న సీఐ శివరామకృష్ణ, ఎస్ఐ హనీఫ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవోల్టేజ్‌తో గృహోపకరణాలు దగ్ధం

రాపూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : హై వోల్టేజ్ కారణంగా పట్టణంలోని తూర్పు అగ్రకట్ట వీధిలోని ఇళ్లల్లో గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన శుక్రవారం జరిగింది. ఒక్కసారిగా విద్యుత్తు హై వోల్టేజ్ రావడంతో ఇళ్లల్లో ఉన్న ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిజ్‌లు, టీవీలతో పాటు తాగునీటి మోటారు కాలిపోయినట్లు కాలనీ వాసులు తెలిపారు. దాదాపు 10 ఇళ్లలో వస్తువులు కాలిపోయాయి. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ గృహోపకరణాలు కాలిపోయాయని బాధితులు వాపోయారు.

రూ.12 లక్షలతో ఉడాయించిన ఏజెంట్

● చీటింగ్ కేసు నమోదు

కావలి రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): కావలిలోని ఐటీసీ ఏజెన్సీలో ఏజెంట్ విజయ్ దుకాణ దారుల వద్ద వసూలు చేసిన రూ.12 లక్షలతో ఉడాయించడంపై శుక్రవారం 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన గాదంశెట్టి విజయ్‌కుమార్ ఐటీసీ కంపెనీ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. ఆ ఏజెన్సీలో 2 ఏళ్ల క్రితం ఏజెంట్‌గా చేరిన విజయ్ నమ్మకంగా పనిచేస్తూ ఏజెన్సీ నుంచి షాపులకు పంపిన స్టాకుకు నగదు వసూలు చేస్తుంటాడు. ఈ క్రమంలో 4 నెలలుగా ఏజెన్సీ నిర్వాహకుడు విజయ్‌కుమార్‌కు రూ.24 లక్షల రసీదులు ఇవ్వగా వారి వద్ద నుంచి రూ.14 లక్షలు వసూలు చేశాడు. కానీ ఐటీసీ ఏజెన్సీలో మాత్రం రూ.2 లక్షల కట్టి మిగతా రూ.12 లక్షలు తన సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయంపై విజయ్‌ను ప్రశ్నించగా మీ వద్ద పని చెయ్యనంటూ వాడుకున్న నగదు ఇవ్వకుండా వెళ్లిపోయాడు. దీంతో ఐటీసీ ఏజెన్సీ నిర్వాహకుడు విజయ్‌కుమార్ ఫిర్యాదుతో 1వ పట్టణ ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

ఆటో బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు స్వప్న

ముత్తుకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి ఆటో బోల్తాపడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం తాళ్లపూడి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఉన్నాయి. దుత్తపాడుకు చెందిన హరి తన ఆటోలో ఇద్దరు కుమార్తెలతో ముత్తుకూరుకు వెళ్తున్నాడు. ప్రధాన రహదారిలో తాళ్లపూడి సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ హరికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో నెల్లూరు వెళ్తున్న ముత్తుకూరు తహసీల్దారు స్వప్న ప్రమాదాన్ని గమనించి గాయపడిన హరికి ప్రాథమిక చికిత్స చేయించారు. 108 వాహనానికి సమాచారం ఇచ్చి మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వింజమూరులో ఇరువర్గాల ఘర్షణ

● ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): వింజమూరు పట్టణంలో వినాయక విగ్రహాల తయారీదారులకు, పందుల పెంపకందారులకు మధ్య ఘర్షణ చోటుచేసుకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. విగ్రహాల తయారీదారులు ఆటోలో వస్తుండగా లారీ కాటా సమీపంలో పందులను లారీ ఎక్కిస్తూ పెంపకందారులు ఉన్నారు. ఆటో తగలబోయిందని విగ్రహాల తయారీదారులతో వివాదానికి దిగారు. ఈ వివాదంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో బొమ్మలు తయారుచేసే సురేష్, రమేష్‌లకు గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ జయరాజ్ తన సిబ్బందితో వైద్యశాలకు చేరుకుని బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 525



రాజరాజేశ్వరి సేవలో ఆదాయ పన్ను కమిషనర్

నెల్లూరు (సాంస్కృతికం), మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని శుక్రవారం రాత్రి ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపాల్ కమిష నర్ శ్రీధర్ దర్శించుకున్నారు. అమ్మవారికి, సుందరేశ్వరస్వామి, గాయత్రీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. కాగా, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీసేవ జరిగాయి.

మహానాడు సక్సెస్‌కు ధన్యవాదాలు

● వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు (హరనాథపురం), మే 30 (ఆంధ్రజ్యోతి) : కడపలో మూడు రోజులు ఘనంగా నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికవడం సంతోషకరమని తెలిపారు. పార్టీలో కార్య కర్తకు ఉన్న విలువను ఈ మహానాడు ప్రస్ఫుటం చేసిందని పేర్కొన్నారు. ఈ మహానాడులో తొలిసారి ఎంపీగా, ఎమ్మెల్యేగా పాల్గొనడం ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని వారు ప్రకటించారు.

రేపు రామకృష్ణ సేవాశ్రమం స్వీకరణ

నెల్లూరు (సాంస్కృతికం), మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 3వ మైలు నవలాకులతోటలోని శ్రీరామకృష్ణ సేవాశ్రమం స్థలం, భవనాలను కోల్‌కతా (హౌరా)లోని బేలూరు రామకృష్ణ మఠం స్వాధీనం చేసుకోనుంది. ఈ మేరకు ఆదివారం స్వాధీన మహోత్సవం జరుగుతుందని రామకృష్ణ సేవాశ్రమం కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి బేలూరు శ్రీరామకృష్ణ మఠం సహాయ జనరల్ కార్యదర్శి స్వామి తత్వవేదనందజీ మహారాజ్, ట్రస్టీ స్వామి జ్ఞానవృతానందజీ మహారాజ్ హాజరవుతారని పేర్కొంది. ఈ కార్యక్రమానికి రామకృష్ణ భక్తులందరూ తరలిరావాలని కోరింది.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. దాత విజయమోహన్ రెడ్డి, డాక్టర్ సురేష్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరేంద్ర రెడ్డి, కార్యదర్శి రవిచంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్ దంపతులతో ఎమ్మెల్సీ భేటీ

నెల్లూరు (జడ్పీ), మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ దంపతులతో ఎమ్మెల్సీ, నెల్లూరు నగర వైసీపీ సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. అరుణమ్మ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్ ఫీడర్‌లో రోడ్డు వెడల్పు పనుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంజయ్ గాంధీనగర్, ఇందిరాగాంధీ నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అలాగే హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఆదిత్యనగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పినాకినీ అవెన్యూ, మధురానగర్, హరనాథపురం, వెలగచెట్టు సంఘం, రాజీవ్‌గాంధీ కాలనీ, అపోలో హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులందరూ ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు నూర్‌బాషా విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 30 (ఆంధ్రజ్యోతి) : నూర్‌బాషా విద్యార్థులకు శనివారం ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమం నగరంలోని పురమందిరంలో ఉదయం 10గంటలకు జరుగుతుందని నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సలీం, గౌరవాధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌వలీ, ఎంప్లాయీస్ అధ్యక్షుడు షేక్ ఖాజావలీలు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ పారితోషికాలను రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారని తెలిపారు. 10వ తరగతిలో 500 మార్కులు, ఇంటర్‌లో 900 మార్కులు సాధించిన విద్యార్థులందరికీ పురస్కారాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో షేక్ మస్తాన్‌వలి, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామ నారాయణరెడ్డి శనివారం ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు సంగం మండలం వీర్ల గుడిపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం వీర్లగుడిపాడులో ఎంజీఎన్ ఆర్‌జీ ఎస్ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తారు. తదనంతరం కోలగట్ల నుంచి వీర్లగుడిపాడుకు అను సంధానం చేసే పంచాయతీరాజ్ రోడ్డును, బ్రిడ్జి ప్రతిపాదనలు, నిర్మాణానికి అవ సరమైన మార్గాన్ని ఆయన పరిశీలిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆత్మ కూరులోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల డివిజనల్ స్థాయి అధికారు లతో సమీక్షిస్తారని మంత్రి ఆనం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

పెన్నా అంచున ప్రమాదం!



భారీగా కుంగిన పాత వంతెన రోడ్డు

● వంతెన చివర భారీగా కుంగిన రోడ్డు, ఇసుక
● బారికేడ్లతో సరిపెట్టిన అధికారులు



కుంగినచోట బారికేడ్లు, ప్రమాద సూచికలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పెన్నా నదిపై ఉన్న పాత వంతెన ప్రమాదకరంగా మారింది. కొన్ని నెలలుగా నదిపై నూతన వంతెన నిర్మాణం జరుగుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయని వాహనదారులు భావిస్తుండగా ఇంతలో పాత వంతెనపై రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. నెల రోజుల క్రితం పాత చెక్‌పోస్ట్ ప్రాంతంలో పాత వంతెనను అనుకొని ఉన్న రోడ్డు భారీగా కుంగింది. దీంతో కిందివైపు నుంచి పటిష్టత కోసం పెద్ద సంఖ్యలో ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. అయితే నిత్యం అధిక సంఖ్యలో వాహనాల రాకపోకల నేపథ్యంలో వంతెన అంచున రోడ్డు మరోసారి భారీ స్థాయిలో కుంగింది. దీంతో కొంత భాగం రోడ్డును అధికారులు మూసేశారు. ప్రమాదాల నివారణకు పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉండగా బారికేడ్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. దీనివల్ల మిగిలిన రోడ్డు కూడా ఎప్పుడు కుంగుతుందో అన్న భయంతో అటువైపు వెళ్లడానికి వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో వేగంగా వచ్చే వాహనాలకు ఈ ప్రాంతంలో ప్రమాదం పొంచి ఉంది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నేటి నుంచి సాయిదర్బార్ వార్షికోత్సవం



వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మధుసాయి, కమిటీ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ సాయిదర్బార్ అద్దాల మందిరం 20వ వార్షికోత్సవం శని, ఆదివారాల్లో జరుగుతుందని మందిరం వ్యవస్థాపక చైర్మన్ మధుసాయి తెలిపారు. శుక్రవారం మందిరంలో వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 9గంటల నుంచి సాయి నామ సంకీర్తన జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాలకు భక్తులందరూ తరలిరావాలని ఆయన కోరారు.



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

పహల్గాం దాడి పిరికిపంద చర్య

నెల్లూరు (వైద్యం), మే 5 (ఆంధ్ర జ్యోతి) : మతసామరస్య, దేశసమగ్రత పరిరక్షణకు సీపీఎం శుక్రవారం నగరం లో భారీ ప్రదర్శన నిర్వహించింది. వీ ఆర్సీ క్రీడామైదానం నుంచి ఆర్టీసీ కూ డలి వరకు ఈ ప్రదర్శన సాగింది. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమే ష్, మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడు తూ పహల్గాం ఉగ్రవాద దాడి పిరికి పంద చర్యని, ఇందులో 26 మంది పర్యాట కులు మరణించటం దారు ణమన్నారు. దేశ సమైక్యత, లౌకిక విలువలపై ఆధారపడి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పార్లమెం టును సమావేశపరిచి ఉగ్రదాడిని, ప్రతిచర్యను వివరించాలని డిమాండ్ చేశా రు. ఈ కార్యక్రమంలో సీపీఎం రూరల్ కా ర్యదర్శి కొండా ప్రసాద్, నాయకులు పెంచల నర్సయ్య, అబ్దుల్ అజీజ్, కట్టా సతీష్, ఒంగో లు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లయినా పూర్తికాని మినీ స్టేడియం నిర్మాణం

ఆత్మకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో మినీ స్టేడియం నిర్మాణం పూర్తికాకపోవడంతో యువత, క్రీడా కారుల ఆశ నిరాశగా మారింది. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయితే వెతలు తప్పుతాయని క్రీడాకారులు ఎదురు చూస్తున్నారు. ఏళ్లతరబడి డివిజన్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఆటస్థలాలు లేక విద్యార్థులు, యువకులు క్రీడలకు దూరమవుతున్నారు. పట్టణంలో డంపింగ్ యార్డ్ సమీపంలో ఉన్న ఖాళీస్థలంలో స్టేడియం నిర్మించాలనే ప్రతిపాదన ఏళ్లు గడుస్తున్నా కార్య రూపం దాల్చకపోవడంతో విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు ఆటస్థలం లేక క్రీడలకు దూరమవుతున్నారు. ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నా స్టేడియం నిర్మాణానికి నోచుకోలేదు. విద్యార్థులు, యువకులు ఆత్మకూరు పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో, ఎస్‌ఆర్‌జె డిగ్రీ కళా శాల క్రీడాప్రాంగణంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ ఆడుతుంటారు. ఇక్కడికి రాని యువకులు, కొందరు విద్యార్థులు పట్టణంలోని రోడ్లపైనే ఆటలాడుకుంటున్నారు.

ఇరుకళల పరమేశ్వరి సేవలో గిరిధర్‌రెడ్డి



గిరిధర్‌రెడ్డికి వేదాశీర్వచనం చేస్తున్న పండితులు

నెల్లూరు (సాంస్కృతికం), మే 30(ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శుక్రవారం రాత్రి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో పండితులు వేదాశీర్వాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వీ గిరికృష్ణ, ఫెస్టివల్ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు. కాగా, కడపలో జరిగిన పార్టీ రాష్ట్ర మహానాడు భోజన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించినందుకు గిరిధర్‌రెడ్డిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు అభినందించారు. శుక్రవారం కడపలో వారిద్దరు భేటీ అయ్యారు. అనంతరం ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి తోనూ గిరిధర్‌రెడ్డి భేటీ అయ్యారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

● కార్పొరేషన్ అధికారులకు మంత్రి నారాయణ ఆదేశం

నెల్లూరు(సిటీ), మే 30 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కార్పొరేషన్ అధికారులకు సూచించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నగర పాలక సంస్థ అధికారులతో సమీక్ష జరిపారు. ప్రస్తుత సీజన్‌కు అనుగుణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు పడుతున్నందున మురుగు, దోమల బెడదను తగ్గించాలన్నారు. అనంత రం వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్ కాలనీ ప్రాంతాల్లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా తాగునీటి సరఫరా ప్లాంట్లను ప్రారంభించి ప్రజలకు అందించారు. ఈ కార్యక్ర మాల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

డిజిటల్ విద్యే లక్ష్యం

నెల్లూరు(విద్య), మే 30 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాలకు డిజిటల్ విద్యను అందించడమే లక్ష్యంగా వీఆర్ ఉన్నత పాఠశాలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి నారాయణ తెలిపారు. నగరంలోని వీఆర్ హైస్కూల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. వీఆర్ హైస్కూల్‌కు ఘన చరిత్ర ఉందని, ఎంతో మంది ప్రముఖులు ఇక్కడి నుంచే ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు అవగాహన రాహిత్యంతో పాఠశాలను మూసివేసి విద్యార్థులకు అన్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మంత్రి లోకేష్ అనుమతితో రూ.15 కోట్ల ఖర్చుతో ఈ సరస్వతీ నిలయాన్ని ఆధునికంగా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. దీనిని దేశంలోనే నెంబర్ వన్ స్కూల్‌గా తీర్చి దిద్దుతామన్నారు. అనంతరం పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, మునిసిప ల్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు సుజన్, ఏడుకొండలు, చిరంజీవి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి

నెల్లూరు (వైద్యం), మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నాయకుడు మల్లికార్జునకు మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ నివాళులర్పించారు. శుక్రవారం నగరంలోని 14వ డివిజన్ బాలాజీనగర్‌కు చెందిన దొడ్డపనేని సుగుణమ్మ భర్త మల్లికార్జున పార్థివ దేహాన్ని మంత్రి సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీని నమ్ముకున్న వారికి ఎప్పుడూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అన్న క్యాంటీన్లో శుభ్రత పాటించాలి

● నగర కమిషనర్ నందన్



అన్న క్యాంటీన్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ),మే 30,(ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్లలో శుభ్రత పాటిం చాలని నగర కమిషనర్ నందన్ సూచించారు. నగరంలోని అన్న క్యాంటీన్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. పారిశుధ్య పనుల తనిఖీలో భాగంగా మద్రాసు బస్టాండ్ వద్దనున్న క్యాంటీన్‌ను సందర్శించారు. టోకన్ విధానం ద్వారానే ఆహారం అందించాలని ఆదేశించారు. 31వ డివిజన్‌లో పర్యటించిన ఆయన కొన్ని ఇళ్ల అసెస్‌మెంట్లను పరిశీలించారు. భవనాల కు కొలతలేశారు. అనంతరం వీఆర్ స్కూల్ పాఠశాల ప్రాంగణాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను తనిఖీ చేశారు.

నేడు ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం), మే 30 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రామారావు జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం టౌనుహాల్లో ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానం జరుగుతుందని నిర్వాహ కురాలు లావణ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సితారా ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలి పారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి నృత్య, పాటల పోటీలు జరుగుతాయని, విజేతలకు ఎన్టీఆర్ పురస్కారాలు అందజేస్తామని ప్రకటించారు. సాయంత్రం సంగీత విభావరి జరుగుతుందని, కళాభిమానులు పాల్గొనాలని కోరారు.











అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

నూనె పంటల సాగుకు ప్రోత్సాహకాలు

● డీఏవో సత్యవాణి

కలిగిరి, మే 30(ఆంధ్రజ్యోతి): నూనె పంటల సాగుకు కేంద్రం అందించే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో శుక్రవారం ఆమె వ్యవసాయాధికారులతో కలిసి రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. రైతులకు వేరుశనగ కొత్త రకం వంగడం టాగ్-73 గురించి అవగాహన కల్పించారు. ఒక హెక్టార్‌కు 150 కేజీల విత్తనాలను నూరుశాతం రాయితీతో ఇవ్వనున్నట్లు తెలిపారు. టాగ్-24 వేరుశనగ రకంను ఎక్కువ కాలము నుంచి రైతులు సాగు చేయడం వలన అఫ్లోట్‌టాక్సిన్ అనే విషపదార్థాన్ని తయారు చేసుకుంటుందని, తద్వారా మానవులకు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు సోకే అవకాశముంటుందన్నారు. దీనికి బదులు టాగ్-73 అనే రకం రైతుకు పరిచయం చేస్తున్నామన్నారు. ఈ విత్తనాన్ని సాగు చేసిన రైతులు మరుసటి సీజన్‌కు సీడెడ్ విత్తనంగా ఉపయోగించుకొని ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. దీనికి సంబంధించి రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తిగల రైతులు చైతన్య ఆర్గనైజేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, శేషగిరి రావు, ఎఫ్‌పీవో చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వర్లు, చైతన్య అర్గనైజేషన్ ఏడీఏ చంద్రభాను, ఏవో సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన సదస్సులు

● ఎస్పీ కృష్ణకాంత్



నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), మే 30 (ఆంధ్రజ్యోతి) : శక్తి యాప్ ఆవశ్యకత గురించి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రజలు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్‌తోపాటు పలు ప్రాంతాల్లో పోలీసు శక్తి బృందాలు మహిళలు, విద్యార్థినులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం అన్నారు. మహిళలు, విద్యార్థినులు, బాలికలు వారి మొబైల్ ఫోన్లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయాల్లో పోలీసుల తక్షణ సహాయం పొందాలని సూచించారు.

న్యాయం కోసం ఓ ఇల్లాలు మౌనపోరాటం

బుచ్చిరెడ్డిపాళెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : రేబాల దళితవాడలో న్యాయం కోసం ఓ ఇల్లాలు తన భర్త ఇంటిముందే నిరసనకు దిగింది. జొన్నవాడ దళితవాడకు చెందిన నెల్లూరు మల్లికార్జున కుమార్తె కల్యాణిని రేబాల దళితవాడకు చెందిన ప్రసన్నకుమార్ వివాహం చేసుకున్నాడు. అయితే, వేధించడమేగాక రెండు రోజుల క్రితం ఇంటినుంచి గెంటేయడంతో కల్యాణి తర భర్త ఇంటి ముందు నిరసన చేపట్టింది. విషయం తెలుసుకుని బంధువులు అక్కడికి చేరుకునేలోపు కల్యాణి అనారోగ్యానికి గురైంది. దీంతో బుచ్చిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో మహిళతో వివాహేతర సంబంధంతోనే ప్రసన్నకుమార్ భార్యను వేధిస్తున్నట్టు బాధితురాలి బంధువులు తెలిపారు.



పొగ కబళిస్తోంది!

● పొగాకుతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
● గుండె, ఊపిరితిత్తులపైనే ఎక్కువ
● జిల్లాలో ఏటా 2 వేల మందికిపైగా మృతి
● వైద్యుల హెచ్చరికలు డోంట్‌కేర్.. ఏటా రూ.1,320 కోట్ల వ్యాపారం
● నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

రూ.1,320 కోట్ల అమ్మకాలు

జిల్లాలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ సిగరెట్లు, పాన్‌మసాలా, గుట్కాల విక్రయాలు రూ.3.66 కోట్లు ఉంటుంది. నెలకు రూ.110 కోట్లకుపైగా సాగే ఈ వ్యాపారం ద్వారానే పన్ను రూపేణా ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం వస్తున్నట్లు సమాచారం. ఏటా రూ.1320 కోట్లు పొగాకు ఉత్పత్తుల అవసరాల కోసం ఖర్చు చేస్తూ తమ శరీరాన్ని నిలువునా కాల్చేసుకుంటున్నారని పలు గణాంకాలు తెలియచేస్తున్నాయి.

నెల్లూరు (వైద్యం) మే 30 (ఆంధ్రజ్యోతి) : సిగరెట్... గుట్కా... పాన్ మసాలా.. కొన్ని రకాల కిళ్లీలు.. వంటి పొగాకు ఉత్పత్తులు మనిషి మనుగడనే శాసిస్తున్నాయి. సరదాగా ప్రారంభమై వీటికి బానిసలవుతున్న ఎందరో చివరకు మృత్యువుకు చేరువ అవుతున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో వయసుతో నిమిత్తం లేకుండా బాలురు సైతం ఈ పొగాకు ఉత్పత్తులకు బానిసలు మారుతున్నారు. కొన్ని సర్వేల ప్రకారం జిల్లాలో 8 లక్షల మందికిపైగా పొగాకు ఉత్పత్తులకు బానిసలవుతున్నట్లు సమాచారం. పొగాకు ఉత్పత్తులలో ప్రమాదకరమైన 4వేల రకాల రసాయనాలు ఉన్నాయి. దీని ప్రభావం వల్ల శరీర అవయవాలు దెబ్బతిని ఏటా జిల్లాలో 2వేల మందికిపైగా మృతి చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం జరుపుకోవాలని తీర్మానించింది. ధూమపానం వల్ల ప్రాణాపాయం తప్పదంటూ ఈ ఏడాది నినాదాన్ని ఇచ్చింది.

● ప్రతి ఐదుగురిలో ఒకరు..

పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో నిర్వహించిన సర్వే ప్రకారం ప్రతి ఐదుగురిలో ఒకరు ధూమపానానికి, పాన్ ఉత్పత్తులకు అలవాటు పడుతున్నట్లు వెల్లడైంది. జిల్లా జనాభాలో 50 శాతం మంది పురుషులు, 7.1 శాతం మంది మహిళలు ఈ పొగాకు ఉత్పత్తులకు బానిసలవు తున్నట్లు తెలుస్తోంది. హైస్కూల్, కాలేజీ విద్యార్థులు వీటికి బాని సలు కావటం ఆందోళన కలిగించే అంశమే. ఏటా 9 శాతం మంది కొత్తవారు పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పొగాకు వాడకం వల్ల 40 శాతం వాడకందారులు కేన్సర్‌కు గురవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ధూమపానం సేవించే వారిలో 80 నుంచి 90శాతం మంది ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతున్నట్లు పలు పరిశోధనలు తెలియజేశాయి. ఊపిరితిత్తులు, గుండెకు సంబంధించిన 26 రకాల వ్యాధులు పొగాకు ఉత్పత్తుల వల్లే వస్తున్నాయి. బహిరంగ ప్రదే శాలలో ధూమపానం చేయరాదని, గుట్కాలు అమ్మరాదని ప్రభు త్వం నిబంధనలు విధించినా వాటిని పట్టించుకునే నాధుడే లేడు.

ఆరోగ్యాన్ని కరిగించేస్తుందిలా...

● గుండెజబ్బులకు సంబంధించి 30 శాతం ధూమపానం వల్లే సంక్రమిస్తున్నాయి.
● సిగరెట్ పొగను పీల్చటంవల్ల వెలువడే కార్సినోజెన్స్ నికోటిన్, రసాయనాల వల్ల గొంతులోని సున్నితమైన పొర మందగించి కేన్సర్‌కు దారితీస్తోంది.
● సిగరెట్ పొగ ఊపిరితిత్తులలో పేరుకుపోవటం వల్ల కఫం ఎక్కువై దగ్గు పొరలు మందగించి ఆ ప్రదేశంలో కణాలు దెబ్బతిని కేన్సర్ బారిన పడే అవకాశం ఉంది.
● శరీరానికి ఆక్సిజన్, పోషకాలను అందించే రక్తం సామర్థ్యం ధూమపానం వల్ల తగ్గుతుంది. దీంతోపాటు అత్యంత హానికరమైన కార్బన్, మొనాక్సైడ్, బయట కాలుష్యం కంటే 600 రెట్లు సిగరెట్‌లో ఉంది. ఇది ఆక్సిజన్ ప్రక్రియకు అవరోధంగా మారుతుంది.
● పొగ వల్ల చర్మంలోని రక్తకణాలు బిగుసుకుపోయి వయసుకు ముందే వృద్ధాప్య లక్షణాలు వస్తాయి.
● అల్సర్ వ్యాధికి దారి తీసే ధూమపానం వ్యాధి నిరోధక శక్తిని తగ్గించి అల్సర్ నివారణ కాదు.
● ఎముకలు పెలుసు బారి త్వరగా విరిగిపోయే అవకాశం ఉంది.
● గుట్కా, పాన్ మసాలా, కొన్ని రకాల కిళ్లీలు నమలటం వల్ల బుగ్గ లోపల చర్మం గట్టిగా మారుతుంది.
● నోట్లో కండరాల పోగులు మందంగా మారి స్పర్శ రహితమై నోరు తెరవలేని పరిస్థితి ఏర్పడుతుంది.
● నోటిలో పుండ్లు చేరి బుగ్గలు బొక్కలు పడే దుస్థితికి దారి తీస్తోంది.



పొగాకుతో ప్రాణాపాయమే!

పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సిగరెట్ పొగ పీల్చడం వల్ల ఆ పొగ ఊపిరితిత్తుల్లోకి చేరి రక్షణ వ్యవస్థను దెబ్బతీస్తోంది. లంగ్స్‌లో నెమ్ము చేరి తీవ్ర అనారోగ్యానికి దారి తీస్తోంది. తమను తాము శుభ్రం చేసుకునే గుణాన్ని ఊపిరితిత్తులు కోల్పోతాయి. సిగరెట్ మానివేయడానికి కొన్ని రకాల మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా మానవచ్చు.

- డాక్టర్ జి.అరుణ,
జీజీహెచ్ పల్మనాలజి హెచ్‌వోడీ

ఆ ఇద్దరు విద్యార్థులకు మార్కులు పెరిగాయ్!

● జవాబుపత్రాల ట్యాంపరింగ్ వ్యవహారంపై ఇంటర్ బోర్డు సీరియస్
● పెరిగిన మార్కుల సర్టిఫికెట్ల జారీ ● బాధ్యులపై విచారణకు కమిటీ

కందుకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): కందుకూరులోని శ్రీగాయత్రీ కళాశాల విద్యార్థులు తన్నీరు సాయితేజశ్విని, ముప్పనేని అవినాష్ బాబులు తమకు వచ్చిన మార్కులపై అనుమానంతో రీ వెరిఫికేషన్‌కు వెళ్లగా జవాబు పత్రాల ట్యాంపరింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ కళాశాలకు పోటీ కళాశాలగా ఉన్న శ్రీ వివేకా కళాశాల పరీక్షా కేంద్రంలో ఈ విద్యార్థులు పరీక్షలు రాయగా అక్కడ ఇన్విజిలేటర్ సహకారంతో మెరిట్ విద్యార్థుల జవాబుపత్రాల ట్యాంపరింగ్ జరిగింది. ప్రాథమిక విచారణలో ట్యాంపరింగ్ నిజమని నిర్ధారించుకున్న ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యల్లో భాగంగా తొలుత వారిద్దరికీ అదనపు మార్కులు కలిపి, సర్టిఫికెట్లను శుక్రవారం విడుదలచేశారు. సాయితేజశ్వినికి ఇంగ్లీష్‌లో 5 మార్కులు కలిపి 93 చేయగా, మొత్తం మార్కులు 988కి పెరిగాయి. అలాగే ముప్పనేని అవినాష్‌బాబుకు ఇంగ్లీష్‌లో 4 మార్కులు కలిపి 84 చేశారు. మొత్తం 975కి పెరిగింది.

● శ్రీ వివేకా కళాశాలపై విచారణ

శ్రీ వివేకా జూనియర్ కళాశాలపై సమగ్ర విచారణకు కమిటీని నియమిస్తూ బోర్డు కార్యదర్శి ఆదేశాలు జారీ చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఇప్పటికే ఆ ఇన్విజిలేటర్‌ను, కళాశాల ప్రిన్సిపాల్ ను పిలిపించి ప్రాథమికంగా విచారించినట్లు తెలిపారు. కమిటీ కూడా క్షేత్రస్థాయిలో సమ గ్రంగా విచారించి వారంరోజుల్లో నివేదిక అందజేస్తుందని తెలిపారు. తదుపరి కళాశాలపై, కారకుడైన ఇన్విజిలేటర్‌పెచర్యలు తీసుకుంటారని తెలిపారు.

హెల్త్ అసిస్టెంట్ల సర్దుబాటు బదిలీలు

● తిరుపతి, నెల్లూరు జిల్లాలకు వేరువేరుగా కౌన్సెలింగ్ ● ఉన్నతాధికారుల చొరవతో ప్రశాంతం

నెల్లూరు (వైద్యం) మే 5 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్ల సర్దుబాటు బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన హెల్త్ అసిస్టెంట్లకు వేరువేరుగా కౌన్సెలింగ్ జరగటంతో ఉద్యోగులలో నెలకొన్న సందిగ్ధత తొల గింది. నెల్లూరు జిల్లాకు చెందిన 171 మంది, తిరుపతి జిల్లాకు చెందిన 57 మంది బదిలీలు జరిగిపోయాయి. రెగ్యులర్, కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ల మధ్య చిన్నపాటి వివాదం చెలరేగడంతో ఈ నెల 28న జరగాల్సిన కౌన్సెలింగ్ వాయిదాపడి శుక్రవారం జరిగింది. తమను కాదని కాంట్రాక్టు ఉద్యోగులను జాబితాలో ముందు చేర్చడాన్ని రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్లు వ్యతిరేకించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే జాబితా తయారు చేశామని జిల్లా అధికారులు వెల్లడించారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతిని కొందరు హెల్త్ అసిస్టెంట్లు కలిశారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియచేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు ప్రాధాన్యమివ్వాలని ఆమె ఆదేశించడంతో అందుకు అనుగుణంగా జిల్లా అధికారులు జాబితా తయారు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు.

నెల్లూరుకు బదిలీ చేయొద్దు

తిరుపతి జిల్లా పరిధిలోని హెల్త్ అసిస్టెంట్లు పలువురు నెల్లూరు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. అయితే తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, నెల్లూరు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాతకు ఫోన్ చేసి తిరుపతి జిల్లాకు చెందిన హెల్త్ అసిస్టెంట్లకు తమ జిల్లాలోనే సర్దుబాటు బదిలీలు చేయాలని కోరారు. ఒకవేళ వారికి నెల్లూరు జిల్లాలో పోస్టింగ్ ఇస్తే వారికి జీతాలు పెట్టనని స్పష్టం చేయడంతో వారిని తిరుపతి జిల్లాలోనే బదిలీ చేశారు. మొత్తం మీద ఈ సర్దుబాటు బదిలీలు ప్రశాంతంగా జరిగాయి. డీఎంహెచ్‌వో సుజాత, ఏవో నిషాంత్ రెడ్డి, మలేరియా అధికారి హుస్సేనమ్మ, సూపరింటెండెంట్లు రషీద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఎన్సీఈఆర్టీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మే 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీఈఆర్టీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవే శానికి జాతీయ స్థాయి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి రమేష్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. ఎన్‌సీఈఆర్టీ రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ పలు కోర్సులను అందిస్తోందని తెలిపారు. రెండేళ్ల బీఎడ్, ఎంఎడ్, మూడేళ్ల సమీకృత బీఎడ్, ఎంఎడ్, నాలుగేళ్ల సమీకృత బీఏ బీఎడ్, బీఎస్సీ బీఎడ్, ఆరేళ్ల సమీకృత ఎమ్మెస్సీఎడ్, రెండేళ్ల ఎంఏ(ఎడ్యుకేషన్) కోర్సు ల్లో సీట్లు భర్తీ చేస్తున్నామనిఇ వివరించారు. దేశవ్యాప్తంగా అజ్మీర్ (రాజస్థాన్) భోపాల్ (మధ్యప్రదేశ్), భువనేశ్వర్ (ఒడిశా), మైసూర్ (కర్ణాటక), షిల్లాంగ్ (మేఘాలయ)లో ఎన్‌సీ ఈఆర్టీ కళాశాలలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. తాజాగా ఏపీలో కూడా ప్రాంతీయ విద్యాసంస్థను స్థాపించి పరిమిత సంఖ్యలో కోర్సులు నిర్వహిస్తోందని తెలిపారు. దీనిలో చేరేందుకు జూన్ 29న జరిగే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు ఎన్‌సీఈఆర్టీ ఆర్ఐఈ వెబ్‌సైట్ ద్వారా జూన్ 17లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించే ఈ సంస్థలలో నామ మాత్రపు ఫీజులతో ఉత్తమ విద్యను పొందడంతోపాటు ఉపకార వేతన సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉత్సవాల్లో అన్ని వసతులు కల్పిస్తాం

● మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు
● వెంగమాంబ ఆలయాభివృద్ధికి కృషి
● సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సురేష్

దుత్తలూరు (ఉదయగిరి), మే 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ఉత్సవాల్లోనైనా వసతులు కల్పిస్తారా?' కథనం ప్రచురితమైంది. దీంతోపాటు ఉత్సవాల ఏర్పాట్లపై నర్రవాడ వెంగమాంబ ఆలయ ఆవరణలో అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భక్తులు, గ్రామస్థులు ఆలయంలో నెలకొన్న సమస్యలపై ఏకరువు పెట్టారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో మంచినీరు ఏర్పాటు చేయడంతోపాటు మరుగుదొడ్ల వసతి కల్పించాలని ఆదేశించారు. దుకాణాల వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవర్ల కల్యాణం ప్రతిఒక్కరు తిలకించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాల సమయంలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి భక్తులకు వసతులు కల్పించి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.



వెంగమాంబ ఆలయంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే, అధికారులకు వివరిస్తున్న గ్రామస్థులు

రూ.4.05 కోట్లు మంజూరు

ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వానికి రూ.6.8 కోట్లతో ప్రతిపాదనలు పంపగా రూ.4.05 కోట్లు మంజూరయ్యాయన్నారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీరాజ్, వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకర్ బాబు, ఈవో వెట్టిగుంట ఉషశ్రీ, సర్పంచ్ నాగయ్య, తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో మల్లికార్జున, టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, నాయకులు గురవయ్యనాయుడు, గురవారెడ్డి, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగా రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), మే 30 (ఆంధ్రజ్యోతి) : యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి యోగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే కార్తీక్ అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్లపై అధికారులతో ఆయన చాం బర్‌లో శుక్రవారం సమీక్ష జరిపారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తమ పొరుగు వారికి యోగాపై అవగాహన, ఆసక్తి కల్పించి రిజిస్టర్ చేసుకునేలా చూడాల న్నారు. క్యూ ఆర్ కోడ్, గ్రామవార్డు సచివాలయ యాప్ ద్వారా రిజిస్టర్ కావాలని చెప్పారు. జిల్లాలో సుమారు 10లక్షల మందిని రిజిస్టర్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 4.5లక్షల మంది నమోదయ్యారని మిగిలిన వారు కూడా నమోదయ్యే విధం గా చర్యలు తీసుకోవాల ని సూచించారు. శనివారం 10 నుంచి 18 ఏళ్లలోపు, 19 నుంచి 35 ఏళ్ల, 35 ఏళ్ల పైబడిన వారికి యోగా పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ వార్డు స్థాయిలో పోటీలు ముగింపు దశకు వచ్చాయని, మండల స్థాయిలో జూన్ 2 నుంచి 7వరకు, జిల్లాస్థాయిలో 9 నుంచి 14 వరకు పోటీలు నిర్వహించాలన్నారు. జూన్ 6వతేదీ నెల్లూరులో జిల్లా స్థాయి యోగా కార్యక్రమం రెసిడెన్షియల్ అసోసియేషన్ థీమ్‌తో జరుగుతుందని, దానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సబ్సిడీ కోసం ఎండీ కార్యాలయానికి ఖాతాలు

నెల్లూరు (హరనాథపురం), మే 30 (ఆంధ్రజ్యోతి) : బీసీలు, ఈడబ్ల్యూఎస్, మేదర-కుమ్మరి, కాపు, జనరిక్ మెడికల్ షాపుల సబ్సిడీ రుణాలకు సంబంధించి బ్యాంకు ఖాతాల వివరాలు ఎండీ కార్యాలయానికి పంపినట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి తెలిపారు. ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో వచ్చిన రుణాల కోసం ఎదురుచూ పులు కథనానికి ఆమె స్పందించారు. బీసీలకు సంబంధించి 1328 యూనిట్లు, ఈడబ్ల్యూఎస్‌కు సంబంధించి 410, మేదర-కుమ్మరికి సంబంధించి 100 యూనిట్లు, కాపులకు సంబంధించి 231 యూనిట్లు, జనరిక్ మెడి కల్ షాపులు 96 యూనిట్లు జిల్లాకు కేటాయించారని చెప్పారు. వీటి కింద నిరు ద్యోగ యువతకు రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు సబ్సిడీ రుణాల కోసం వివిధ యూనిట్లను ఎంపిక చేసి బ్యాంకుకు పంపినట్లు తెలిపారు. బ్యాంకు వారు ఇప్పటి వరకు బీసీలకు సంబంధించి 623 యూనిట్లు, ఈడబ్ల్యూఎస్‌కు సంబంధించి 107 యూనిట్లు, మేదర - కుమ్మరికి సంబం ధించి ఒక యూనిట్, కాపులకు సంబంధించి 64యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపులు 2యూనిట్లు మంజూరు చేసి ఖాతాలు తెరిచారన్నారు. ఆ అకౌంట్ల ను బీసీ కార్పొరేషన్ వారు కలెక్టర్ ద్వారా విజయవాడలోని వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు సబ్సిడీ కోసం పంపినట్లు వివరించారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

● రాకపోకలకు ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు

విడవలూరు, మే 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో విద్యుత్ స్తంభాలు రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేస్తారు. అయితే మండల పరిధిలోని ఊటుకూరు, విడవలూరు మన్మధరావుపేటలో మాత్రం రోడ్డు మధ్యలో ఏర్పాటు చేశారు. అలా ఎందుకు ఏర్పాటు చేశారన్న విషయం ఏవ్వరికీ అంతుపట్టడం లేదు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలను మార్చాలని స్థానికులు పలుమార్లు విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాహనదారులు అదుపుతప్పి విద్యుత్ స్తంభాలకు ఢీకొని ప్రమాదాల భారీన పడుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ లేని సమయాల్లో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదలు జరుగుతున్నా విద్యుత్ శాఖాధికారులు మాత్రం వాటిని మార్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఆ రహదారిపై ట్రాక్టర్లు, వ్యాన్లు, ఆటోలు రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను రోడ్డు మధ్యలో నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.





ఊటుకూరు, విడవలూరులో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

పంపిణీకి పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

ఉదయగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 50 శాతం రాయితీతో విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆయా రైతు సేవా కేంద్రాల్లో విత్తనాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9188
వెండి కిలో ధర	రూ. 99500
వెండి ఒక గ్రాము	రూ. 102.50

న్యూస్ బాక్స్

వెంగమాంబ సన్నిధిలో వేలం పాటలు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

దుత్తలూరు (ఉదయగిరి), మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. వచ్చేనెల 15 నుంచి 19వ తేదీ వరకు అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండడంతో వివిధ అంశాలపై బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. ఈ వేలం పాటలో తాత్కాలిక అంగళ్ల నిర్వహణకు కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన పప్పు గోవిందు రూ.6.50 లక్షలకు పాటపాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకర్‌బాబు, ఈవో వెట్టిగుంట ఉషశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు సంగం మండలం వీర్లగుడిపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం వీర్లగుడిపాడులో ఎంజీఎన్ ఆర్‌జిఎస్ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తారు. తదనంతరం కోలగట్ల నుంచి వీర్లగుడిపాడుకు అను సంధానం చేసే పంచాయతీరాజ్ రోడ్డును, బ్రిడ్జి ప్రతిపాదనలు, నిర్మాణానికి అవ సరమైన మార్గాన్ని ఆయన పరిశీలిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆత్మకూరులోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల డివిజనల్ స్థాయి అధికారులతో సమీక్షిస్తారని మంత్రి ఆనం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రధానోపాధ్యాయుల నియామకం

ఉదయగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ బదిలీపై వెళ్లిన వారి స్థానంలో నూతన ప్రధానోపాధ్యాయుల నియామకం జరిగిందని ఎంఈవో-2 శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, అప్పసముద్రం, బిజ్జంపల్లి, కృష్ణంపల్లి, వెంకట్రావుపల్లి పాఠశాలలకు ఆర్ రవీంద్ర, షేక్ హసీనా, జీ శ్రీనివాసులు, జే మాధవరావు, మాసూం సత్తార్, సీహెచ్ వెంకటేశ్వర్లును ఉన్నతాధికారులు నియమించినట్లు తెలిపారు.


ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

వింజమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వితంతువులు, వికలాంగుల సంక్షేమం కోసం ఎన్టీఆర్ భరోసా పేరుతో ప్రతి నెలా 1వ తేదీన పంపిణీ చేస్తున్న పింఛన్లను ఈనెల 31వ తేదీనే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో శనివారం పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. వింజమూరు మండలానికి సంబంధించి 5508 పింఛన్లను సచివాలయ సిబ్బంది ఉదయం 7గంటల నుంచి పంపిణీ చేస్తారని, తీసుకోలేని వారికి 2వ తేదీ పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

సోమశిలలో 42.742 టీఎంసీల నీరు

అనంతసాగరం, మే 30 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 42.742 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నాడెల్టాకు 3,300, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత



పట్టుకున్న చికెన్ వ్యర్థాలను పూడ్చిపెడుతున్న సిబ్బంది

సంగం మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు వద్ద అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మినీ వాహనాన్ని స్థానిక పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వ్యాన్‌లో ఉన్న 12 డ్రమ్ముల్లోని చికెన్ వ్యర్థాలను కొండ సమీపంలో పూడ్చిపెట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

- అమలుకాని నిబంధనలు
- పట్టించుకోని అధికారులు



డంపింగ్‌యార్డు వద్ద నిల్వ ఉన్న పాలిథిన్ సంచులు



బస్టాండ్ పక్కన బ్రిడ్జి వద్ద ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

సీతారామపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది. ప్రజారోగ్యాన్ని పీల్చిపిప్పి చేస్తోంది. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు కలుగుతాయని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా ఉత్పత్తిదారులు, వినియోగదారుల్లో మార్పు రావడంలేదు. వాటిని నియంత్రిం చాల్సిన అధికారులు సైతం చూసీ చూడనట్లు గా వదిలేస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ వినియోగం యధేచ్ఛగా సాగుతోంది. ప్లాస్టిక్ టీగ్లాసులు, వాటర్ బాటిళ్లు, పాలిథిన్ సంచుల వినియోగం బాగా పెరిగింది. టీ దుకాణాల వద్ద వేడి టీని పాలిథిన్ కవర్లలో వేస్తున్నారు. దానివల్ల కవర్ కరిగి ఆ టీలో కలిసిపోతుంది. అది తాగిన వారికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. డిస్పోజబుల్ కప్‌లో తాగినా ప్లాస్టిక్ ఉంటుంది. రోజులో మన వాడకాల్లో సగానికి పైగా ప్లాస్టిక్ ఉంటోంది. పర్యావరణం, ప్రజల ఆరోగ్యాలను నాశనం చేస్తోంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వినియోగించడం వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 గ్రాముల కంటికి కనిపించని మైక్రోప్లాస్టిక్ రేణువులు చేరుతున్నాయని ఓ సర్వేలో వెల్లడయింది.

అమలుకాని నిబంధనలు

75 మైక్రాన్ల లోపు మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగించకూడదనే నిబంధన ఉన్నా ఎవరూ పాటించడం లేదు. 75నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న పాలిథిన్ కవర్లను ఎక్కడ పడితే అక్కడ విక్రయిస్తు న్నారు. వీటిని నియంత్రించిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రజలు వినియోగించిన పాలిథిన్ కవర్లను రోడ్లపై వేయడంతో వాటిని మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నా యని జంతుప్రేమికులు ఆందోళన చెందుతు న్నారు. ఒక్క ప్లాస్టిక్ కవరు భూమిలో కలవడానికి పదేళ్లు పడుతుందట. ఈలోపు అది చేసే కీడు అనంతం. అందువల్ల పాలిథిన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాల్సిందే. పాలిథిన్ సంచి చిన్న కిళ్లీ బడ్డీలో కూడా దొరుకుతుంది. కానీ నార సంచి కావాలంటే వెతుకు లాడాల్సిందే. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు నార సంచులను ఉచితంగా పంపిణీ చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

పొదుపుపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సునీత

ఉదయగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న కిశోర బాలికలు పొదుపు చేయడంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో సునీత సూచించారు. శుక్రవారం పట్టణంలోని సినిమాహాల్ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు అవసరాలను బట్టి డబ్బులు ఆదా, ఖర్చు చేయడం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ తేజస్విని, కార్యకర్త సుజాత పాల్గొన్నారు.

ముగిసిన చిత్రలేఖనం శిక్షణ తరగతులు



చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్ఐ

ఉదయగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంస్కార భారతీ ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీ నుంచి జరుగుతున్న ఉచిత చిత్రలేఖనం శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో చిన్నారులకు చిత్ర కళాకారుడు సుదర్శన్ ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న పిల్లలకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకేశవులు, బీజేపీ నాయకులు నారాయణరెడ్డి, కార్తీక్, విప్లవ్‌కుమార్‌రెడ్డి, గురవయ్యపాల్గొన్నారు.

రెండు మోటారు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

సంగం మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు బైక్‌లు శుక్రవారం ఢీకొన్నాయి. దీంతో నెల్లూరుకు చెందిన నాగరాజు, సంగంకు చెందిన వెంకటేశ్వర్లుకు గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని బుచ్చి వైద్యశాలకు తరలించారు.

ఈ బస్సులో ప్రయాణం ఎలా సార్..



చిరిగిన బస్సు సీటు

అనంతసాగరం మే 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు డిపో బస్సులో వె నుక సీటు చిరిగి అధ్వానంగా ఉంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమశిల - ఆత్మకూరుకు రాకపోకలు సాగించే ఈసర్వీస్‌పై ఆర్టీసీ అధికారులు కాస్త దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పదేళ్లయినా పూర్తికాని మినీ స్టేడియం నిర్మాణం

- క్రీడాకారులు, విద్యార్థుల అవస్థలు



ఆత్మకూరులో అసంపూర్తిగా నిలిచిపోయిన మినీ స్టేడియం నిర్మాణం

ఆత్మకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో మినీ స్టేడియం నిర్మాణం పూర్తికాకపోవడంతో యువత, క్రీడాకారుల ఆశ నిరాశగా మారింది. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయితే వెతలు తప్పుతాయని క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు. ఏళ్లతరబడి డివిజన్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఆటస్థలాలు లేక విద్యార్థులు, యువకులు క్రీడలకు దూరమవుతున్నారు. పట్టణంలో డంపింగ్ యార్డ్ సమీపంలో ఉన్న ఖాళీస్థలంలో స్టేడియం నిర్మించాలనే ప్రతిపాదన ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చకపోవడంతో విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు ఆటస్థలం లేక క్రీడలకు దూరమవుతున్నారు. ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నా స్టేడియం నిర్మాణానికి నోచుకోలేదు. విద్యార్థులు, యువకులు ఆత్మకూరు పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో, ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాల క్రీడాప్రాంగణంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ ఆడుతుంటారు. ఇక్కడికి రాని యువకులు, కొందరు విద్యార్థులు పట్టణంలోని రోడ్లపైనే ఆటలాడుకుంటున్నారు. స్టేడియం లేకపోవడం వలన ఆటలు ఆడలేకపోతున్నామని పలువురు క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సత్వరమే సమస్యల పరిష్కారం : ఆర్డీవో



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆత్మకూరు ఆర్డీవో పావని, రెవెన్యూ సిబ్బంది.

కలువాయి, మే 30 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై అందిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపుతామని ఆత్మకూరు ఆర్డీవో పావని తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలం లోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు వచ్చి పెద్దఎత్తున తమ సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. అనంతరం బ్రాహ్మణ పల్లిలో జరుగుతున్న రీసర్వేను ఆమె పరిశీలిం చారు. ఎలాంటి తప్పులకు తావులేకుండా సర్వే నిర్వహించాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పెరంకొండ మనోహర్ రాజుపాళెంలో ప్రజల సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే నివేదిక అందచేయాలని వీఆర్వోను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు, డీటీ వెంకటేశ్వర్లు, రెవెన్యూ, సర్వే సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం



జ్ఞానమ్మ కుటుంబానికి రూ. లక్ష నగదును అందజేస్తున్న నాగేశ్వరరావు

ఆత్మకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శి, బంగారు కుటుంబాలు అనే కార్యక్రమంలో ఆర్థికంగా స్థిరపడినవారు, విదేశాల్లో ఉన్నవారు పేద వారిని దత్తత తీసుకుని అభివృద్ధిపరచాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చిన విషయం విదితమే. ఈక్రమంలో ఈనెల 1వ తేదీన ఆత్మకూరు పర్యటనలో భాగంగా చంద్రబాబునాయుడు మండలం నారంపేటకు చెందిన గిరిజన మహిళ జ్ఞానమ్మ కుటుంబాన్ని వేదికపైకి పిలిచి వారి బాధలు, కష్టాలు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబాన్ని మర్రిపాడు మండలం, పడమటినాయుడుపల్లికి చెందిన సాహో ఫౌండేషన్ అధినేత నాగేశ్వరరావు దత్తత తీసుకున్నారు. కాగా, శుక్రవారం ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో జ్ఞానమ్మ కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల నగదును అందజేశారు. ఈ నగదుతో మేకలు కొనుగోలు చేసి జీవనోపాధి కల్పించుకుంటామని జ్ఞానమ్మ కుటుంబసభ్యులు తెలిపారు. ఈసందర్భంగా ఆర్డీవో బి పావని మాట్లాడుతూ జ్ఞానమ్మ కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేశామని, పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ జ్ఞానమ్మ కుటుంబానికి అన్ని విధాలా చేయూతనందిస్తానని తెలిపారు.

అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఉదయగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం ఆవరణలో శుక్రవారం రాజమాత రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు నారాయణరెడ్డి, కార్తీక్, శ్రీహరి, విప్లవ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ఆవుల రోశయ్యయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు పెడుతుందన్నారు. అనంతరం కృష్ణాపురంకు చెందిన నీటి సంఘాధ్యక్షుడు బేరి విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చల్లా సుబ్బరత్నం, సుబ్రహ్మణ్యం, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సాగరంలో వర్షం

అనంతసాగరం మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. ప్రస్తుతం రెండవ పంట వరి సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఈక్రమంలో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

C.R.I.M.E N.E.W.S



రహదారిపై ట్యాంకర్‌ను ఢీకొని బోల్తాపడిన మినీ వ్యాన్

ట్యాంకర్ - వ్యాన్ ఢీ

- ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం టమోటా లోడుతో రాంగ్ రూట్‌లో వచ్చిన మినీ వ్యాన్ ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి గూడూరు వైపుగా ఆయిల్ ట్యాంకర్ వెళ్తుండగా గొలగమూడి క్రాస్ రోడ్డు నుంచి కాకుటూరు వైపుగా రాంగ్ రూట్‌లో వచ్చిన మినీ వ్యాన్ వేగంగా ఢీకొంది. దీంతో ట్యాంకర్ ముందు భాగం దెబ్బతింది. ప్రమాదానికి కారణమైన మినీ వ్యాన్ రహదారిపై బోల్తాపడింది. ఈప్రమాదంలో ట్యాంకర్‌లో ఉన్న క్లీనర్ శ్రీనాథ్‌కు గాయాలు కాగా మినీ వ్యాన్ డ్రైవర్ కూడా గాయపడ్డాడు. టమోటాల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ బోల్తాపడడంతో టమోటాలు అన్ని రోడ్డు పాలయ్యాయి. ఈప్రమాదం రహదారి మధ్యలో జరగడంతో సుమారు కిలోమీటర్‌కు పైగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న వెంకటాచలం పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. రహదారిపై ఉన్న రెండు వాహనాలను క్రేన్ సహయంతో పోలీసులు పక్కకు తొలగించారు. క్షతగాత్రులను 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

పొదలకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడేరు రోడ్డు బస్ షెల్టర్ వద్ద శుక్రవారం నక్కా లక్ష్మమ్మ (58) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సమాచారం అందుకున్న సీఐ శివరామకృష్ణ, ఎస్ఐ హనీఫ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవోల్టేజ్‌తో గృహోపకరణాలు దగ్ధం

రాపూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : హై వోల్టేజ్ కారణంగా పట్టణంలోని తూర్పు అగర్తకట్ట వీధిలోని ఇళ్లల్లో గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన శుక్రవారం జరిగింది. ఒక్కసారిగా విద్యుత్తు హై వోల్టేజ్ రావడంతో ఇళ్లల్లో ఉన్న ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిజ్‌లు, టీవీలతో పాటు తాగునీటి మోటారు కాలిపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. దాదాపు 10 ఇళ్లలో వస్తువులు కాలిపోయాయి. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ గృహోపకరణాలు కాలిపోయాయని బాధితులు వాపోయారు.

రూ.12 లక్షలతో ఉడాయించిన ఏజెంట్

- చీటింగ్ కేసు నమోదు

కావలి రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): కావలిలోని ఐటీసీ ఏజెన్సీలో ఏజెంట్ విజయ్ దుకాణ దారుల వద్ద వసూలు చేసిన రూ.12 లక్షలతో ఉడాయించడంపై శుక్రవారం 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన గాధంశెట్టి విజయ్‌కుమార్ ఐటీసీ కంపెనీ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. ఆ ఏజెన్సీలో 2 ఏళ్ల క్రితం ఏజెంట్‌గా చేరిన విజయ్ నమ్మకంగా పనిచేస్తూ ఏజెన్సీ నుంచి షాపులకు పంపిన స్టాకుకు నగదు వసూలు చేస్తుంటాడు. ఈ క్రమంలో 4 నెలలుగా ఏజెన్సీ నిర్వాహకుడు విజయ్‌కుమార్‌కు రూ24 లక్షల రసీదులు ఇవ్వగా వారి వద్ద నుంచి రూ.14 లక్షలు వసూలు చేశాడు. కానీ ఐటీసీ ఏజెన్సీలో మాత్రం రూ.2 లక్షల కట్టి మిగతా రూ.12 లక్షలు తన సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయంపై విజయ్‌ను ప్రశ్నించగా మీ వద్ద పని చెయ్యనంటూ వాడుకున్న నగదు ఇవ్వకుండా వెళ్లిపోయాడు. దీంతో ఐటీసీ ఏజెన్సీ నిర్వాహకుడు విజయ్‌కుమార్ ఫిర్యాదుతో 1వ పట్టణ ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

ఆటో బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు స్వప్న

ముత్తుకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి ఆటో బోల్తాపడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం తాళ్లపూడి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఉన్నాయి. దుత్తపాడుకు చెందిన హరి తన ఆటోలో ఇద్దరు కుమార్తెలతో ముత్తుకూరుకు వెళ్తున్నాడు. ప్రధాన రహదారిలో తాళ్లపూడి సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ హరికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో నెల్లూరు వెళ్తున్న ముత్తుకూరు తహసీల్దారు స్వప్న ప్రమాదాన్ని గమనించి గాయపడిన హరికి ప్రాథమిక చికిత్స చేయించారు. 108 వాహనానికి సమాచారం ఇచ్చి మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వింజమూరులో ఇరువర్గాల ఘర్షణ

- ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): వింజమూరు పట్టణంలో వినాయక విగ్రహాల తయారీదారులకు, పందుల పెంపకందారులకు మధ్య ఘర్షణ చోటుచేసుకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. విగ్రహాల తయారీదారులు ఆటోలో వస్తుండగా లారీ కాటా సమీపంలో పందులను లారీ ఎక్కిస్తూ పెంపకందారులు ఉన్నారు. ఆటో తగలబోయిందని విగ్రహాల తయారీదారులతో వివాదానికి దిగారు. ఈ వివాదంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో బొమ్మలు తయారుచేసే సురేష్, రమేష్‌లకు గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ జయరాజ్ తన సిబ్బందితో వైద్యశాలకు చేరుకుని బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 525

పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

కందుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ, లింగ ఎంపికల ఆధారిత గర్భస్రావాల కారణంగా తలెత్తిన లింగనిష్పత్తి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేసేందుకు వైద్యఆరోగ్య శాఖ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి సత్ఫలితాలు సాధించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టరు రజనీ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 16 స్కానింగ్ సెంటర్లను తనిఖీలు చేసి తగు ఆదేశాలు జారీ చేయటంతో పాటు చట్టం అమలు కోసం ఏర్పాటైన కమిటీ సమావేశం నిర్వహించి అమె పలు సూచనలు చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులుగా ఉన్న డాక్టరు శైలజ, డాక్టరు హరికృష్ణ, డాక్టరు కొండయ్య, పట్టణ ఎస్‌ఐ సాంబశివయ్య, ఆరోగ్య అధికారులు పద్మావతి, ప్రేమలత, జీ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సరే.. డ్రైనేజీ కాలువలు ఏవీ!


ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న మురుగునీరు

కావలి మండలం ఆముదాలదిన్నెలో ఇటీవల సీసీ రోడ్లు నిర్మించారు. అయితే ఇళ్ల నుంచి వచ్చే మురుగు, వర్షం నీరు వెళ్లడానికి డ్రైనేజీ కాలువలు నిర్మించడం విస్మరించారు. దీంతో వర్షం వచ్చినప్పుడల్లా రోడ్డు పక్కన, ఇతర ప్రాంతాల్లో నీరు నిల్వ చేరుతోంది. దీనితో పాటు ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు సైతం వెలుపలకు వెళ్లే అవకాశం లేక ఎక్కడికక్కడ మడుగుకట్టి దుర్వాసన వెదజల్లుతోండడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఈ మడుగులు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామంలోని మండపానికి సమీపంలో పాత సీసీ రోడ్డు పల్లంగా ఉండడంతో ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపై చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయం గుర్తించిన స్థానిక టీడీపీ నేత ఉప్పాల దినేష్ శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో కాలువ ఏర్పాటు చేయించి రోడ్డుపై నిల్వ చేరిన మురుగు నీటిని తొలగింప చేశారు. సీసీ రోడ్లు నిర్మించిన కూటమి ప్రభుత్వం డ్రైనేజీ కాలువలు కూడా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- కావలిరూరల్,(ఆంధ్రజ్యోతి)


కాలువలు లేక రోడ్డు పక్కన నిల్వ చేరిన మురుగు నీరు

ఇది మురుగు గుంత కాదండోయ్!


మురుగు నీటితో నిండిన మంచి నీటి వాల్వుపిట్ గుంట

ఈ ఫొటోలో కనిపిస్తున్న గుంత మురుగు నీటి నిల్వ గుంత కాదండోయ్... ప్రజలకు మున్సిపాల్టీ సరఫరా చేసే మంచినీటి వాల్వుపిట్ గుంత. వాస్తవానికి మంచినీటి సరఫరాలో నియంత్రణకు ఏర్పాటు చేసిన వాల్వ్‌పిట్ గుంతపై మూత బండ వేసి వాల్వ్‌ను తిప్పుకునేందుకు అవసరమైన రంధ్రం మాత్రమే ఉంచాలి. కానీ కావలి రైల్వే రోడ్డులో ఆర్వోబీ వంతెన సమీపంలో ఉన్న ఈ వాల్వుపిట్ గుంతపై మూత బండలేకుండా ఉండటమే కాక అది తరచూ లీక్ అవుతుండటంతో ఆగుంతలో ఎప్పుడూ నీరు నిలిచి దానిలో పందులు తదితరాలు పొర్లాడి మురుగునీటి గుంత కన్నా ఘోరంగా తయారైంది. మంచినీటి సరఫరా ఆగిపోయినపుడు ఈ మురుగు నీరు తిరిగి మంచినీటి పైపుల్లోకి వెళ్లి మంచినీరు కలుషితం అవుతోంది. అధికారులు స్పందించి వాల్వుపిట్ గుంతలో మురుగునీరు చేరకుండా చర్యలు చేపట్టాలి.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

ఇళ్ల ముంగిట మురుగు!

కావలి పట్టణంలోని ఆర్వోబీ వంతెన ఉత్తరం వైపున ఉన్న ప్రధాన డ్రైనే.ఈ కాలువలో మురుగు ముందుకు కదలక ఇళ్ల ముంగిట చేరింది. ఆ డ్రైనేజీ కాలువ పూర్తిగా బండలతో మూసివేయడంతో మురుగు నీరు పారుదలకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ఆ డ్రైన్ నిర్మాణం చేపట్టాలంటే దాని పక్కనే ఉన్న ప్రధాన మంచినీటి పైపులైన్‌ను మార్చాల్సి ఉంది. అయితే 5 రోజుల కిందట ఆ ప్రాంతంలోని చర్చి సమీపంలో ప్రధాన పైపులైన్ పగిలి పోవటంతో అక్కడ తవ్వి మరమ్మతులు చేపట్టారు. ఆ సమయంలో పక్కనున్న డ్రైన్‌లోకి గుంతలోని నీరు, మట్టిని వేయడంతో అది కాలువలోకి జారి కాలువ పూర్తిగా స్తంభించింది. దానిలో పూడిక తీయాలంటే పక్కనే దానిపైన శాశ్వత ప్రాతిపదికన వేసిన మూత బండలను తొలగించాలి. దీంతో మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ఆ డ్రైన్‌లోకి వచ్చే అనుసంధాన కాలువల్లోని మురుగు నీరు ముందుకు వెళ్లడంలేదు. దాని పక్కనే ఉన్న దారావారి వీధిలో మురుగు నీరు ముందుకు పోక ఇళ్ల ఆవరణలోకి వస్తోంది. మున్సిపల్ అధికారులు స్పందించి ప్రధాన డ్రైన్ పూడికతీసి మురుగు నీటి పారుదలకు ఉన్న ఆటంకాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు..

- కావలి, (ఆంధ్రజ్యోతి)


మంచినీటి పైపులైన్ పగిలిన చోట డ్రైనేజీ కాలువలో ముందుకు సాగని మురుగు


దారా వారి వీధిలో ఇళ్ల ఆవరణలోకి వచ్చిన మురుగు

గిట్టుబాటు ధర కల్పనకు ప్రభుత్వం కృషి

● కందుకూరు-2 వేలం కేంద్రంలో పొగాకును పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పొగాకు కు గిట్టుబాటు ధర కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రైతులు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక పామూరు రోడ్డులోని కందుకూరు-2 పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం ఆయన వేలంను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, బోర్డు అధికారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎగుమతిదారులతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పనకు చర్యలు తీసుకోవాలని, లో గ్రేడ్ పొగాకుకు కొంత పర్సంటేజీ ధరలు పెంచి ఇవ్వాలని కోరారు. రైతులు ఆందోళన చెందకుండా వారికి అన్నిగ్రేడ్‌లకు గిట్టుబాటు ధర లభించేలా బోర్డు అధికారులు వ్యాపారులు, రైతులతో సమన్వయం చేసి వేలం నడిచేలా చూడాలని సూచించారు. పలువురు రైతులు గత ఏడాది మీడియం గ్రేడ్‌లకు కూడా క్వింటాల్‌కు రూ.28వేలు నుంచి 30 వేలు వరకు ధర లభించిందని, అయితే ప్రస్తుతం కొద్దిశాతం బేళ్లకు రూ.28వేలు ధర చూయించి అతితక్కువ ధరకే కొంటున్నారన్నారు.ఈ కార్యక్రమంలో పొగాకుబోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, బోర్డు అధికారులు, రైతుప్రతినిధులు పాల్గొన్నారు.


కందుకూరు 2 పొగాకు వేలం కేంద్రంలో వేలం తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, రైతు ప్రతినిధులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నిరుపేదల వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించటంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ఉదారంగా స్పందిస్తున్నారని, సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 27 మందికి మంజూరైన రూ.24.56 లక్షల చెక్కులను శుక్రవారం సాయంత్రం ఆయన బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, నాదెండ్ల వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుల నియంత్రణకు వ్యాక్సినేషన్

● మర్రిపూడి మధు,
పశువైద్యాధికారి, సాయిపేట క్లస్టర్

కొండాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): పశువులు, గొర్రెలు, మేకలు తదితర జీవాలకు సీజనల్‌గా సంక్రమించే వ్యాధుల నియంత్రణకు ముందుగానే వ్యాక్సినేషన్ వేయిస్తాం. ముఖ్యంగా తొలకరి సీజన్‌లో నేలమురక, గుండెజబ్బు, గొంతువాపువ్యాధి(గేదెలు, జీవాలు)లకు గిట్టలు పుండ్లు ఏర్పడుట తదితర వ్యాధులపై రైతులకు అవగాహన కల్పిస్తాం. క్లస్టర్ పరిధిలో పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడకుండా ఉండేదుకు రైతులను సమాయత్తం చేస్తున్నామని సాయిపేట క్లస్టర్ పశువైద్యాధికారి మర్రిపూడి మధు తెలిపారు.

? క్లస్టర్ పరిధిలో ఎన్ని పశువులు, జీవాలు ఉన్నాయి.

! సాయిపేట క్లస్టర్ పరిధిలోని 16 గ్రామాల్లో 320 గోవులు, 6200 గేదెలు, 13000 జీవాలు ఉన్నాయి.

? పాడి రైతులకు రాయితీ పథకాలు అందుతున్నాయా.

! తెల్ల రేషన్‌కార్డు కలిగిన పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశుదాణా అందజేస్తున్నాము. 50 కేజీల దాణా బస్తా వాస్తవ ధర రూ.1110. దానికి రైతు కేవలం రూ.555 చెల్లించి వైద్యశాలవద్ద పొందవచ్చు.

? పశు బీమా పథకానికి రైతులు ఎంత ప్రీమియం చెల్లించాలి.

! సాధారణ గేదెలు ఒక్కోదానికి 3 ఏళ్ల కాలపరిమితితో రూ.149, హైబ్రిడ్, సంకర జాతి గేదెలకు రూ.298 చెల్లించాలి. నాటు గేదె మరణిస్తే రూ.15 వేలు, హైబ్రిడ్, సంకర జాతి గేదెలకు రూ.30 వేలు ప్రభుత్వం అందచేస్తుంది. జీవాలకు ఏడాది కాలపరిమితికి రూ.36 చెల్లిస్తే మరణిస్తే రూ.6 వేలు చెల్లిస్తుంది.

? క్లస్టర్ పరిధిలో సిబ్బంది కొరత ఉందా.

! సాయిపేట క్లస్టర్ పరిధిలోని సాయిపేట పశువైద్యశాలలో 15 ఏళ్ల నుంచి వెటర్నరీ అసిస్టెంటు, కొమ్మి పశువైద్యశాలలో 10 ఏళ్ల నుంచి అటెండరు పోస్టు ఖాళీగా ఉన్నాయి.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుడ్లూరు, మే 30(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని మందుల విభాగాన్ని పరిశీలించి రోగులకు ప్రతి రోజు అందిస్తున్న మందుల వివరాలను తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ప్రతి రోజు సమయపాలన పాటిస్తు పనిచేయాలన్నారు. ఎక్కడకూడా వ్యాధిగ్రస్తులకు ఇబ్బంది కలగకుండా చూడలని సూచించారు. గ్రామాల్లో సదస్సులు నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రమ్యారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, తదితర నాయకులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ యోగాలో భాగస్వామ్యం కావాలి


యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

కావలి రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని, యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ జూన్ 21న మండల స్థాయిలో జరిగే యోగా దినోత్సవ కార్యక్రమానికి అందరు హాజరై జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరులో శిక్షణ పొందిన యోగా మాస్టర్ ట్రైనర్‌లు చంద్రిక, రేణుక, విజయభారతి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆహిల్యా బాయి హోల్కర్ జయంతి


జయంతి కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

కందుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): పుణ్య శ్లోక ఆహిల్యా బాయి హోల్కర్ జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ నాయకులతో పాటు కావలి పట్టణ బీజేపీ మాజీ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆహిల్యా బాయి జీవితవిశేషాలను, మూడు శతాబ్దాల క్రితమే జాతి నిర్మాణం కోసం ఆమెచేసిన కృషిని వివరించారు. మరుగునపడిన మహనీయుల త్యాగాలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న కృషి శ్లాఘనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు గట్టమనేని హరిబాబు, పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, ఇన్నమూరి సుధాకర్, చల్లా వెంకటరాజా, కూచిపూడి డేవిడ్, ఉన్నం భాస్కరరావు, మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి రేషన్ షాపుల్లో నిత్యావసరాల పంపిణీ

కొండాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్దనే సరుకులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. ఈ విషయంపై మండలంలోని 34 రేషన్ దుకాణాల డీలర్లకు శుక్రవారం తన కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. డీలర్లు ప్రభుత్వం సూచించిన నిర్దిష్ట సమయం ప్రకారం అందుబాటులో ఉండి వినియోగదారులకు సక్రమంగా, తూకాలలో తేడాలేకుండా సరుకులను పంపిణీచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏఐటీయూసీ నియోజకవర్గ మహాసభ

కందుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ కందుకూరు నియోజకవర్గ మహాసభను జూన్ 1న స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కె.మురళీ, వై. ఆనంద్‌మోహన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిషోర్ ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని కార్మిక చట్టాల గురించి వివరిస్తారని తెలిపారు. ఏఐటీయూసీకి అనుబంధంగా ఉన్న వివిధ కార్మికసంఘాల ప్రతినిధులు, కార్మికులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

కోదండ రామాలయ వార్షికోత్సవం


విశేష పూజలు అందుకున్న సీతారామ లక్ష్మణులు

కందుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెవెన్యూ కాలనీ ఉన్న కోదండరామాలయంలో 20వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు, ఆలయ అర్చకులు గుంటూరు శ్రీనివాసమూర్తి స్వామివారికి విశేష పూజలు నిర్వహించటంతో పాటు అర్చన, అభిషేకాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

గుడ్లూరు, మే 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చేవూరు గ్రామ సీపీఎం నాయకుడు, విశ్రాంత వీఆర్వో నూతలపాటి వెంకటేశ్వర్లు సతీమణి రమాదేవి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈ. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు శుక్రవారం చేవూరుకు చేరుకొని ఆమెకు ఘన నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా రమాదేవి మృతదేహాన్ని పరిశోధనల నిమిత్తం కుటుంబ సభ్యులు ఒంగోలు రిమ్స్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటెనపల్లి వెంకటేశ్వర్లు, గౌస్, జీవీబీ కుమార్, కొట్లే వెంకయ్య, పసుపులేటి పెంచలయ్య, దామా కృష్ణయ్య, కూరపాటి జనార్దన్ తధితరులు పాల్గొన్నారు.


రమాదేవికి నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు

నేడు పింఛన్ల పంపిణీ

లింగసముద్రం, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామా ల్లో శనివారం ఉదయం పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జూన్ 1న ఆదివారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. మండలంలో అన్ని రకాల పింఛన్ల లబ్ధిదారులు 5198 మంది ఉన్నారని చెప్పారు.

ఉపాధి పనుల పరిశీలన

వలేటివారిపాలెం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతవారిపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఏపీఓ దయాసాగర్ పరిశీలించారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకు పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలని సూచించారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు.

నేడు రోటరీ స్వర్గధామంలో

దహనశాలలకు శంకుస్థాపన

కావలి, మే30(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ ఉత్తర శివార్లలోని రోటరీ స్వర్గధామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న నాలుగు దహనశాలలకు శనివారం ఉదయం శంకుస్థాపన కార్యక్రమం చేపట్టనున్నట్లు రోటరీ బాధ్యులు తెలిపారు. దాత అంకిపల్లి రమేష్‌రెడ్డి సహకారంతో రూ.40 లక్షలతో నిర్మించనున్న ఈ దహనశాలల శంకుస్థాపనకు రావాలని శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డిని కావలిలోని ఆయన నివాసంలో రోటరీ బాధ్యులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్వర్గధామం ఛైర్మన్ డాక్టర్ మాధవరెడ్డి, రోటరీక్లబ్ ఛైర్మన్ స్వర్ణలత, దాత అంకిపల్లి రమేష్‌రెడ్డి, నల్లూరు రమేష్, బుర్లా శ్రీధర్‌రెడ్డి, జీ.రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని కలిసిన రోటరీ క్లబ్ బాధ్యులు

శ్రీవారి సేవలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల

జలదంకి, మే 30(ఆంధ్రజ్యోతి): కడపలో మూడు రోజులపాటు జరిగిన తెలుగుదేశం మహానాడు విజయవంతం కావడంతో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం తిరుమల చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. మహానాడుకు టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చి తిరిగి వారివారి ఇళ్లకు సురక్షితంగా చేరుకోవడంలో ఎలాంటి అవరోధాలు, ఇబ్బందులు కలగకుండా చేయాలని తాను వేంకటేశ్వర స్వామిని కోరుకున్నానని, నియోజకవర్గ ప్రజలు మహానాడుకు వెళ్లి సురక్షితంగా వారివారి నివాసాలకు చేరుకోవడంతో దేవదేవుడిని దర్శించుకుని మొక్కు చెల్లించాలనని కాకర్ల పేర్కొన్నారు. గన్నవరం, మార్కాపురం ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కందుల నారాయణరెడ్డిలతో కలసి స్వామి వారిని దర్శించుకున్నారు.


తిరుమల శ్రీవారి సన్నిధిలో ఉదయగిరి, గన్నవరం, మార్కాపురం ఎమ్మెల్యేలు కాకర్ల, యార్లగడ్డ, కందుల

ప్రత్యేక పీజీఆర్‌ఎస్‌కు 11 అర్జీలు

బిట్రగుంట, మే 30 (ఆంధ్రజ్యోతి): బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కర వేదిక నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలపై 11 అర్జీలను అందచేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమని ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించడం సర్వసాధారం అన్నారు. అయితే రైతుల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే ప్ర త్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశామన్నారు. వచ్చిన అర్జీలను పరిశీ లించిన ఆర్డీవో సంబంధిత వీఆర్వోలకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దారు సురేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దారు భరత్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అన్ని పంచాయతీల వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


అర్జీ పరిశీలిస్తున్న కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

నోటీసులు ఇచ్చి ఆక్రమణలు తొలగిస్తాం

వలేటివారిపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శింగమనేనిపల్లెలో సర్వే నెంబరు 25, 26, 27లలో 6.26 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైందని, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి తొలగిస్తామని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. దీనిపై శింగమనేనిపల్లె గ్రామానికి చెందిన చిడిపోతు వెంకటేశ్వర్లు గతంలో గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం శింగమనేనిపల్లె పంచాయతీ పరిధిలోని ఎంపీపీ స్కూల్‌లో గ్రామ సర్పంచ్ అత్తోటి జయమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వాహించారు. ఈ సభలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో నరేంద్రదేవ్

కిశోరి వికాసంపై అవగాహన

వలేటివారిపాలెం, మే 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొంతవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలికలకు కిశోరి వికాసంపై సూపర్‌వైజర్ సునీత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా పోలీస్ సుమలత, కార్యకర్త వెంకటేశ్వరమ్మ బాలికలు పాల్గొన్నారు.

● **బిట్రగుంట:** నాగులవరం పంచాయతీ దళితవాడలోని అంగన్వాడీ సెంటర్‌లో కిశోరి వికాసం - వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ సుప్రజ, ఇంచార్జి కార్యదర్శి సుజన, గ్రామ మహిళా పోలీసు శైలజ, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో సమైక్యత యాత్ర

బిట్రగుంట, మే 30(ఆంధ్రజ్యోతి): బోగోలు, ఇబ్రహీంపేట పంచాయతీలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యత యాత్ర నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుమ్మల వెంకయ్య, టీ.మాల్యాద్రి, ఎన్.రామయ్య, జీ.మాల్యాద్రి, చల్లానరహరి, అన్వర్‌బాషా పాల్గొన్నారు.



కోడిబొచ్చు కథలో కొత్త ట్విస్ట్

● టెండరు పిలిచిన కార్పొరేషన్
● టన్ను రూ.వందకే కొట్టేసేందుకు బిడ్డర్ యత్నం ● పైరవీలతో టెండర్ దాఖలు


తిరుపతి - ఆంధ్రజ్యోతి

తిరుపతి కోడిబొచ్చు కథలో మరో ట్విస్ట్ బయట పడింది. ఎన్నికల ముందు వైసీపీ చేస్తున్న చికెన్ వేస్ట్ మాఫియా బాగోతాన్ని ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ బహిరంగ సభలో ప్రస్తావించడంతో కోడిబొచ్చు వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో పవన్‌కల్యాణ్ దృష్టికి ఈ విషయం వెళ్లేలా చేసిన సదరు అజ్ఞాత వ్యక్తి చికెన్ వేస్ట్‌ను తన గుప్పెట్లోకి తీసుకున్నట్లు పెద్దయెత్తున ప్రచారం జరిగింది. నాలుగు నెలల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పందించి చికెన్ వేస్ట్‌కు పుల్‌స్టాప్ పెట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నగరపాలక సంస్థ అధికారులు కూడా చికెన్ వేస్ట్‌ను మీట్‌మీల్‌గా మార్చే ప్రక్రియ కోసం అన్వేషించారు.

● ఆంధ్రజ్యోతి సూచనతో టెండర్ ఆహ్వానం

కోడిబొచ్చు వ్యవహారంపై వస్తున్న విమర్శలు తిరుపతి నగరపాలక సంస్థకు తలనొప్పిగా మారాయి. చికెన్‌వేస్ట్‌ను మీట్‌మీల్‌గా మారిస్తే అటు కార్పొరేషన్‌కు ఆదాయంతో పాటు ఇటు వ్యర్థాలను చేపల చెరువులకు తరలించకుండా వీలవుతుందని 'ఆంధ్రజ్యోతి' సవివరాలతో ప్రచురించింది. దీనిపై దృష్టిపెట్టిన మున్సిపల్ కార్పొరేషన్ రెండు వారాల క్రితం చికెన్ వేస్ట్‌ను రీసైకిల్ చేసేందుకు టెండరు ఆహ్వానించింది. ఇక్కడే మరో ట్విస్ట్ బయటపడింది. మహానగరాల్లో చికెన్ వేస్ట్ టన్ను రూ.500 వరకు ధర ఉంటే కేవలం రూ.100కే టన్ను చికెన్ వేస్ట్‌ను దక్కించుకునేందుకు ఓ రీసైక్లింగ్ సంస్థ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. కొందరు రాజకీయ పెద్దల అండదండలతో కార్పొరేషన్ అధికారులతో ఒత్తిడి చేయించి రూ.100కే టన్ను చికెన్ వేస్ట్‌కోసం కోట్ చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది. తిరుపతి నగరంలో రోజుకు 5 టన్నుల చికెన్ వేస్ట్ వస్తుంది. ఆదివారాల్లో 10 టన్నుల వరకు వస్తుంది. అంటే సాధారణ రోజుల్లో రూ.500, ఆదివారాల్లో వెయ్యి రూపాయలు మాత్రమే కార్పొరేషన్‌కు ఆదాయం వస్తోంది. పోటీఎవరూ రాకుండా అనుకూలమైన నిబంధనలు కూడా పెట్టుకున్నట్టు సమాచారం. అయితే ఒకే బిడ్డర్ పాల్గొంటే టెండరు రద్దు చేసే ఆలోచనలో కూడా యంత్రాంగం లేకపోలేదు.

సూక్ష్మ, తుంపర్ల సేద్యానికి జవజీవాలు



తుంపర్ల నీటితో సాగవుతున్న వేరుశనగ



బిందు సేద్యంతో మామిడి సాగు

గూడూరు అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): జగన్ జమానాలో ఐదేళ్లు నిర్లక్ష్యానికి గురైన సూక్ష్మ నీటి సాగు పథకానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. వ్యవసాయ, ఉద్యానవన పంటల్లో నీటి ఎద్దడిని తట్టుకుంటూ, అధిక ఉత్పత్తులను సాధించేందుకు బిందు, తుంపర్ల సేద్యం రైతులకు ఎంతగానో దోహదపడుతోంది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలో నీటి ఎద్దడి పరిస్థితులను అధిగమించేందుకు రైతులను విస్తృతంగా బిందు సేద్యంలో భాగస్వాములను చేయాలని సంకల్పిస్తోంది. 2019-24 మధ్య కాలంలో అచేతనంగా మిగిలిపోయిన ఏపీఎంఐపీ(ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి పారుదల పథకం)కి జవజీవాలు నింపేందుకు ఆ శాఖ 2025-26 వార్షిక ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.37.2 కోట్లు ఖర్చు చేసి 4వేల హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యానికి పరికరాలు సమకూర్చనున్నారు. నిమ్మ, మామిడి, బత్తాయి, సపోటా, అరటి, కూరగాయలు, మిరప, ఆయిల్ పామ్, చెరకుతో పాటు పువ్వు, పలు రకాల దోస రకాలు, అలాగే స్ప్రింకర్లతో వేరుశనగ, మినుము, పెసర పంటలను సాగు చేసే సుమారు 5,000మంది రైతులకు ఈ పథకంలో ఎంతో ప్రయోజనం కలగనుంది. జగన్ ప్రభుత్వంలో మొత్తం ఐదేళ్ల కాలంలో ఖర్చు చేసిన దానికంటే కూడా ఇది ఎక్కువే. వైసీపీ అధికారంలో ఉన్న 2019-24 మధ్య ఐదేళ్ల కాలంలో జిల్లాలో కేవలం 5,002 హెక్టార్లలో రూ.32.98కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 4,451మంది రైతులే అరకొరగా లబ్ధి పొందారు.



సతీష్,
డీడీ, ఏపీఎంఐపీ

అధిక దిగుబడులకు సూక్ష్మ సేద్యమే మేలు

పంట నాణ్యతతో పాటు అధిక దిగుబడులకు సూక్ష్మ సేద్యమే మేలని జిల్లా సూక్ష్మ సాగునీటి పథకం ఉప సంచాలకులు జి.సతీష్ సూచించారు. జిల్లాలో తీరప్రాంతాలు అయిన వాకాడు, కోట, చిల్లకూరు, చిట్టమూరు మండలాలకు తగిన ప్రాధాన్యం కల్పించనున్నట్లు చెప్పారు. రైతు చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రాజెక్టు డైరెక్టర్ లేదా మైక్రో ఇరిగేషన్ అధికారి, తిరుపతి పేరు మీద అకౌంట్ నెంబరు 922010035414746, ఐఎఫ్ఎస్‌సీ కోడ్:యుటిఐబి0003195, యాక్సిస్ బ్యాంకు, తిరుపతి ఖాతాకు రైతులు నేరుగా నగదు జమ చేయవచ్చని ఆయన చెప్పారు.

దరఖాస్తు ఇలా...

పంటల సాగుకు పరికరాల కోసం రిజిస్ట్రేషన్లను సమీపంలోని ఆర్ఎస్‌కే(రైతు సేవాకేంద్రం)లో బయోమెట్రిక్ ద్వారా రైతులే నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. సులభంగా సాగే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆధార్ కార్డు, తహసీల్దారు చేత ధృవీకరించబడిన భూమి హక్కు యాజమాన్య పత్రం లేదా 1-బి తప్పనిసరి.

ఎన్నో ఉపయోగాలు

బిందు-తుంపర్ల సేద్యం వల్ల నీరు, విద్యుత్ ఆదాతో పాటు ఎరువుల వినియోగం కూడా తగ్గుతుంది. మొక్కలు బాగా పెరిగి పంట ఉత్పాదకత ఎక్కువగా ఉంటుంది. పురుగుల బెడద, తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉంటుంది. కలుపు మొక్కల పెరుగుదల లేకపోవడంతో అంతర సేద్యం ఖర్చు కూడా తక్కువగానే ఉంటుంది. సూక్ష్మ సేద్యం వల్ల అదనంగా 20శాతం భూమికి నీరు అందుతుండగా 35-40శాతం దాకా విద్యుత్ ఆదా అవుతుంది. 40-45శాతం ఎరువుల వాడకం, 35-40శాతం కూలీల అవసరం తగ్గుతోంది.

ముక్కంటి ఆలయ వేద పండితుడిపై సస్పెన్షన్ వేటు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

శ్రీకాళహస్తి, మే 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ వేదపండితుడు మారుతీశర్మపై ఈవో బాపిరెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ప్రైవేటు ప్రాంగణమైన రాఘవేంద్ర స్వామి మఠంలో గురువారం ముక్కంటి ఆలయ వేదపండితుడు హాజరై హీరో శ్రీకాంత్ కుటుంబీకులతో నవగ్రహ శాంతిపూజలు చేయించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ఆంధ్రజ్యోతి వార్త ప్రచురించింది. శుక్రవారం ఈవో బాపిరెడ్డి దానిపై స్పందిస్తూ ఆలయ ఉద్యోగిగా ఉంటూ ప్రైవేటు పూజల్లో పాల్గొన్న మారుతీశర్మను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడురోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఎస్‌ఏలకు ముగిసిన పదోన్నతులు

● 186మందికి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా ప్రమోషన్



ఎస్‌ఏలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖాధికారులు



పదోన్నతుల కోసం వేచివున్న టీచర్లు

చిత్తూరు సెంట్రల్, మే 30(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంల దాకా బదిలీల, పదోన్నతి ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది.డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం రాత్రి 9.30 గంటలకు చిత్తూరు డీఈవో కార్యాలయం పక్కనే ఉన్న ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన పదోన్నతుల ప్రక్రియ శుక్రవారం వేకువ జామున 3 గంటల వరకు సాగింది. 186 మందికి స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది.జడ్పీ యాజమాన్యంలో 155 పోస్టులకు గాను ముగ్గురు గైర్హాజరయ్యారు. వీరితో సహా 155 మందికి పదోన్నతులు లభించాయి. 25 మంది టీచర్లు నాట్ విల్లింగ్ ఇచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో 12 మంది, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఏడుగురికి పదోన్నతి లభించింది. ఏడీలు వెంకటేశ్వరరావు, సుకుమార్, నాగరాజు, రాంకుమార్, మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు సంబంధించి 12 మందికి కడప ఆర్జేడీ కార్యాలయంలో ఈ ప్రక్రియ జరిగింది.

ఒక్క రోజు హెచ్‌ఎంలుగా ముగ్గురు టీచర్లు

ఒక్క రోజు హెచ్‌ఎంలైన వారిలో ముగ్గురు టీచర్లున్నారు. ఈ ముగ్గురు శుక్రవారం ప్రస్తుతమున్న స్థానంలో రిలీవై, శనివారం ఉదయం కొత్త చోట జాయినై గ్రేడ్-2లుగా పదోన్నతి పొందుతారు.అదే రోజు సాయంత్రం రిటైర్ కానున్నారు. మిగిలిన వారు శనివారం ప్రస్తుతమున్న స్థానంలో రిలీవై, జూన్ 1న ఆదివారం కొత్త చోట జాయినై గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందుతారు.వీరిలో కుప్పం ఎంపీపీఎస్ నుంచి ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం కె.వి.శ్రీదేవి పదోన్నతిపై గుండ్ల్యాయనివారి పల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లారు.తిరుపతిలోని పద్మావతిపురం జడ్పీ హైస్కూలు నుంచి ఇంగ్లీష్ ఎస్‌ఏ టి.సుధారాణి పదోన్నతిపై పొన్నగూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా వెళ్లారు. తిరుచానూరు సమీపంలోని ఓటేరు ఎంపీపీఎస్ నుంచి హెచ్‌ఎం ఎస్.సుబ్రమణ్యం పదోన్నతిపై తిమ్మరాజుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లారు.



కె.వి.శ్రీదేవి - టి.సుధారాణి

డీసీసీబీకి, విండోలకు త్వరలో కమిటీలు

చిత్తూరు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకారకేంద్ర బ్యాంకుతో పాటు 75 సింగిల్ విండోలకు త్వరలో కమిటీలు ఏర్పడనున్నట్లు సమాచారం.డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా అమాస రాజశేఖర రెడ్డి నియామకం గురువారం జరిగింది. ప్రభుత్వం గత ఏడాది డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ విద్యాధరిని నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు జూన్ నెల 26వ తేదీవరకు అమల్లో ఉంటాయి. అందువల్ల జేసీ స్థానంలో అమాస నియామకం వచ్చేనెల 27వ తేదీ నుంచి ఆరునెలల కాలానికి మరో జీవోను తర్వాత జారీచేస్తారు. సాధారణంగా డీసీసీబీ పాలకవర్గాన్ని అనధికార వ్యక్తులతో భర్తీ చేసేటప్పుడు ఇన్‌చార్జి ఛైర్‌పర్సన్‌తో పాటు మరో ఆరుగురిని సభ్యులుగా నియమిస్తారు. వచ్చేనెల జారీచేయనున్న జీవోలో మాత్రం ఏడుగురితో పాలకమండలిని నియమించిన తర్వాత అమాస రాజశేఖర రెడ్డి పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన ఎం.రెడ్డెమ్మ తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలోనే తన పదవికి రాజీనామా చేసి తప్పుకున్నారు. నాటి నుంచి గత ఆరునెలలుగా డీసీసీబీ ఛైర్మన్ పదవి ఖాళీగానే ఉంది. నామినేటెడ్ ఛైర్మన్, పాలకవర్గ సభ్యులు లేకపోవడంతో డిపాజిట్ దారులు, సహకార సంఘాల సభ్యులు తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం లేకపోయింది. గత పాలకవర్గం చేసిన ఆర్థిక తప్పిదాలపై సహకారచట్టం సెక్షన్-51 మేర విచారణ పూర్తయ్యింది. శనివారం విచారణ అధికారి అయిన డీఆర్వో మోహన్ కుమార్ ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందించనున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఏ ఒక్కరిపై చర్యలు తీసుకోకున్నా ఉద్యోగులపై కేసులు పెట్టే అవకాశముందన్న సమాచారంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన అమాస రాజశేఖర రెడ్డి జూన్ మొదటి వారంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

కళ్లు తెరవకుండానే కాలువ ఒడికి..

● మురికి కాలువలో గర్భస్థ శిశువుల మృతదేహాలు

గూడూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ఈ లోకంలోకి రాకమునుపే ఆ పసికందులు విగతజీవులయ్యారు. కళ్లు తెరవకుండానే మురికికాలువ పాలయ్యారు. ఇక్కడి అశోక్‌నగర్ ప్రాంతంలోని మురికి కాలువలో శుక్రవారం ఉదయం ఇరువురు గర్భస్థ శిశువుల మృతదేహాలు కనిపించాయి. స్థానికులు గుర్తించి దిగ్భ్రమ చెందారు. వెంటనే ఒకటో పట్టణ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు చేరుకుని మృతదేహాలను బయటకు తీయించారు. తర్వాత స్థానికుల సాయంతో పూడ్చి పెట్టించారు. నెలలు పూర్తి కాకుండానే తల్లి గర్భం నుంచి బయటపడి మృతిచెంది ఉండవచ్చునని కొందరు భావిస్తున్నారు. అబార్షన్ కావడంతో రాత్రి సమయంలో తెచ్చి మురికి కాలువలో పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. విచారణలో వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకే యువికా

● షార్ డైరెక్టర్ రాజరాజన్ వెల్లడి



విద్యార్థులతో మాట్లాడుతున్న షార్ డైరెక్టర్ రాజరాజన్

సూళ్లూరుపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన కల్పించి యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇస్రో ఆధ్వర్యంలో యువికా (యువ విజ్ఞాన కార్యక్రమం) నిర్వహిస్తున్నట్లు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. ఈ నెల 19న ప్రారంభమైన యువికా - 2025 (యువ విజ్ఞాన కార్యక్రమం) ముగింపు వేడుకలను శుక్రవారం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో ఘనంగా నిర్వహించారు. 12 రోజుల పాటు షార్ కేంద్రంలో జరిగిన యువికా కార్యక్రమానికి ఏపీ, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 49 మంది విద్యార్థులు హాజరయ్యారు. అంతరిక్ష ప్రయోగాలు, నమూనా ఉపగ్రహాలు, రాకెట్ల రూపకల్పన, అంతరిక్ష పరిజ్ఞానంపై సీనియర్ శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించారు. ఇస్రోకు యువ ఇంజినీర్లు ఎంతో అవసరమని, రానున్న రోజుల్లో దేశ భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని ఆర్ముగం రాజరాజన్ అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు షార్ డైరెక్టర్ క్షుణ్ణంగా సమాధానమిచ్చారు. వారిని అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

బాల కార్మికుల గుర్తింపునకు రేపటి నుంచి ప్రత్యేక డ్రైవ్

తిరుపతి(కలెక్టరేట్), మే 30(ఆంధ్రజ్యోతి): బాల కార్మికుల గుర్తింపు కోసం జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కార్మిక, విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్మిక, విద్యాశాఖ, ఎస్ఎస్ఏ, స్త్రీశిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ బాల కార్మికులను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించాలన్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బాల కార్మిక నిషేధ చట్టం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఉప కార్మిక కమిషనర్ ఓంకారరావు, సహాయ కమిషనర్ చిన్నలాలప్ప, డీఎస్పీ శ్రీలత, డీఎంహెచ్‌వో బాలాజీ నాయక్, డీఈవో కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వసంతబాయి పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 30(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల కారణంగా వర్షాలు పడుతున్నాయని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డీఆర్వో నరసింహులుతో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ఫోన్ నంబర్లు, టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాతబడిన సంక్షేమ వసతిగృహాల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగరపాలక కమిషనర్ మౌర్య, డీపీవో సుశీలాదేవి, ఆర్డీవోలు పాల్గొన్నారు.



పూదోటలో పట్టుబడిన జెర్రిపోతు

తిరుమలలోని టీటీడీ గార్డెన్‌లో శుక్రవారం జెర్రిపోతు పాము పట్టుబడింది. శ్రీవారిసేవా సదన్‌కు సమీపంలోని టీటీడీ ఫ్లవర్ గార్డెన్‌లో ఆరు అడుగుల పొడవైన పాము ప్రవేశించింది. గుర్తించిన ఉద్యానవన సిబ్బంది పాములు పట్టే టీటీడీ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఎల్ మురుగన్



ఆనం రామనారాయణరెడ్డి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ప్రభుత్వ విప్ వెంకటరావు, ఉత్తరప్రదేశ్ మంత్రి సంజయ్‌సింగ్, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, జనార్దన్‌రావు, నక్కా ఆనంద్‌బాబు ఉన్నారు. దర్శనానంతరం ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ మహాజాతరను తలపించేలా జరిగిన మహానాడు పసుపు పండగను చూసి శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానని చెప్పారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఎంపికైన చంద్రబాబుకు పూర్తి ఆశీస్సులు ఇవ్వాలని కోరుకున్నట్లు తెలిపారు. అంతకుముందు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, మురుగన్ తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి పార్క్‌లో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.42 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,019

తలనీలాలు సమర్పించినవారు: 37,774





పంబలేరు వాగుపై ఉన్న చప్టా



పంబలేరు వాగుపై నిర్మించి, అసంపూర్తిగా ఉన్న వంతెన



పంబలేరు వాగులో నీటి ప్రవాహం(ఫైల్ ఫొటో)

గట్టెక్కని పంబలేరు వంతెన

అప్రోచ్ రోడ్లు నిర్మించక నిరుపయోగం

రూ.8 కోట్లు అవసరమని అంచనా

అధ్వానదారిలో తప్పని రాకపోకలు

గూడూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో కోట్ల రూపాయల వ్యయంతో పూర్తి చేసిన హైలెవెల్ వంతెన వినియోగంలోకి రాని వైనమిది. హైవేల అభివృద్ధికి మునుపు నెల్లూరు నుంచి గూడూరుకు, గూడూరు మీదుగా వెంకటగిరి, తిరుపతి, రాపూరు మార్గాలకు బైపాస్ రోడ్డు నుంచి పంబలేరు చప్టా మీదుగా రాకపోకలు సాగించేవారు. వరద వస్తే ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. వరదనీరు పంబలేరు వాగు ద్వారా చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం వద్ద కండలేరు క్రీక్‌లో కలసి గుమ్మళ్లదిబ్బ సమీపంలోని సముద్రంలోకి చేరుతుంది. వరద సమయంలో చప్టాపై పది అడుగుల మేర నీరు ప్రవహించేది. దీంతో చప్టా కనిపించక రాకపోకలు నిలిచిపోయేవి. సాహసించి ప్రయాణించిన వారు మృత్యువాతపడిన సందర్భాలున్నాయి. ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వరద ఉధృతికి వాగులో కొట్టుకుపోయి సుమారు పదిహేను మంది వరకు ప్రాణాలు కోల్పోయిన సంఘటనను జిల్లా ప్రజలు మర్చిపోలేరు.

ఏడాదిన్నర క్రితం వంతెన పూర్తి

ప్రమాదాల నివారణకు పంబలేరు చప్టాపై హైలెవల్ వంతెన నిర్మాణమొక్కటే మార్గం. కాలక్రమేణా విజయవాడ-చెన్నై జాతీయ రహదారి నిర్మాణం పూర్తి అయ్యింది. దీంతో నెల్లూరు వైపు నుంచి గూడూరుకు పంబలేరు చప్టా వైపు నుంచి కాకుండా హైవే మీదుగా పోటుపాళెం కూడలి నుంచి మార్గం ఏర్పడింది. అయినా ఎక్కువమంది గూడూరు పట్టణ వాసులు దగ్గర దారి కావడంతో పంబలేరు చప్టాపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. నెల్లూరు వైపు నుంచి తిరుపతి, రాపూరుకు దగ్గర కావడంతో ఈ మార్గంలోనే వెళతారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సీఎం చంద్రబాబుతో చర్చించి పంబలేరు చప్టాపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.19.5 కోట్లు మంజూరు చేయించారు. 2019లో వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. పనులను రెండేళ్లలోగా పూర్తి చేయాలని నిర్దేశించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, టీడీపీ ప్రభుత్వం మారడంతో పనులు నత్తనడక సాగాయి. ఎట్టకేలకు 2023 డిసెంబరులో పనులు పూర్తయ్యాయి.



వంతెన పూర్తయినా ఇరువైపులా నిర్మించని అప్రోచ్ రోడ్లు

నిధుల కోసం నిరీక్షణ

వంతెన నిర్మించినా నిరుపయోగంగానే నిలిచిపోయింది. ఎందుకంటే అప్రోచ్ రోడ్లకు నిధులు చాలలేదు. దీంతో రాకపోకలకు కష్టాలు తీరలేదు. దీనికితోడు చప్టా నుంచి హైవేకి వెళ్లే మార్గం అధ్వానంగా తయారైంది. ఈ నేపథ్యంలో ఎలాగైనా వంతెనను వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ గట్టి సంకల్పంతో కృషి చేస్తున్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల జరిగిన మినీమహానాడులో సైతం పంబలేరు వంతెనను అందుబాటులోని తెస్తామని తీర్మానించారు. నిధులు మంజూరు చేసి అప్రోచ్ రోడ్లు నిర్మిస్తే పంబలేరు హైలెవెల్ వంతెన వినియోగంలోకి వస్తుంది. పట్టణ ప్రజల సుదీర్ఘకాల కోరిక నెరవేరుతుంది.

జీవవైవిధ్య పరిరక్షణకు చర్యలు

● జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్



మంగళం, మే 30(ఆంధ్రజ్యోతి): శేషాచల కొండల్లో అరుదైన జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కొన్ని రోజుల క్రితం జీవవైవిధ్య పరిశోధనలకు ఫుల్‌స్టాప్ అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ స్పందించారు. ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ శేషాచల జీవవైవిధ్య పరిశోధనలపై వచ్చిన కథనం తనను ఉత్సాహపరిచిందన్నారు. పరిరక్షణకు, పరిశోధనలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే పరిశోధనశాలను మరమ్మతు చేస్తున్నామన్నారు. ముగ్గురు పరిశోధకులను, అవసరమైతే మరొకరిని నియమించి పూర్తిస్థాయి పరిశోధనలు జరిగేలా చూస్తామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, అవసరమైతే అటవీ శాఖ సొంత నిధులతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత, పరిశోధనలలో వచ్చే సమాచారాన్ని డిజిటలైజేషన్ చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

మహిళకు లైంగిక వేధింపులు

● యూట్యూబర్ హేమాద్రితో పాటు మరొకరిపై కేసు నమోదు



హేమాద్రి

తిరుచానూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధించిన యూట్యూబర్‌తో పాటు మరొకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం మంగళం క్వార్టర్స్‌కు చెందిన కల్లూరి హేమాద్రి స్థానికంగా ఓ వివాహితను లైంగికంగా వేధిస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా మెసేజీలు చేసి వేధించేవాడు. ఫొటోలు మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో పెడతానని బెదిరించేవాడు. రెండు రోజుల క్రితం హేమాద్రి తన సన్నిహితురాలు నాగవర్ధిని నివాసానికి ఆ వివాహితను రప్పించి బెదిరించాడు. దీంతో బాధితురాలు తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో హేమాద్రితో పాటు అతని సన్నిహితురాలు నాగవర్ధనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. హేమాద్రిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. గతంలోనూ ఇతనిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

భవిష్యత్తు అవసరాల కోసం..

● పాపవినాశనం, ఆకాశగంగ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించండి


● టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, మే 30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆకాశగంగ, పాపవినాశనం, గదులు కేటాయించే సీఆర్వో(సెంట్రల్ రిసెప్షన్ ఆఫీస్) అభివృద్ధి, ఆధునికీకరణపై టీటీడీ ఈవో శ్యామలరావు తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం సమీక్షించారు. ఈ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి నిపుణులు రూపొందించిన ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈవో మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల పర్యావరణ, ఆధ్యాత్మిక అభివృద్ధికి రూపకల్పన చేయాలన్నారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సీఆర్వోను కూడా ఆధునికీకరించి, భక్తులు సులువుగా గదులు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీఈ సత్యనారాయణ, అర్బన్ డెవలప్మెంట్ అండ్ డిజైనింగ్ నిపుణులు రాముడు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పగాకు

'నా పేరు ముకేష్... ఒక సంవత్సరం గుట్కా నమిలాను... నోటి క్యాన్సర్ ఆపరేషన్ జరుగుతోంది, బహుశా ఇక నేను మాట్లాడలేపోవచ్చు...'ప్రతి సినిమా ప్రారంభానికి ముందు వచ్చే ఈ మాటలు అందరినీ ప్రభావితం చేస్తాయి. అనారోగ్య హేతువైన ధూమపానం ఎంత ప్రమాదకరమో దృశ్య రూపంలో వివరించి ఆందోళన కలిగిస్తాయి.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి



ధూమపానంతో పెరుగుతున్న క్యాన్సర్ల ముప్పు

నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

సరదాగా ప్రారంభించే ధూమపానం మానలేని వ్యసనంగా మారుతుంది. పొగాకులోని నికోటిన్, విషతుల్యాలు ఊపిరితిత్తులు, గుండె జబ్బుల వంటి దీర్ఘకాల వ్యాధుల దగ్గర నుంచి క్యాన్సర్ల వరకూ దారితీస్తాయని వైద్యులు చెబుతున్నారు.. మన దేశంలో రోగాలకు, మరణాలకు కారణమవుతున్న ప్రధాన అంశాల్లో పొగాకు అలవాటు ఒకటి. మన జిల్లాలో 15, అంతకన్నా ఎక్కువ వయసు పైబడిన వారిలో సుమారు 30 శాతం మంది పొగ తాగుతున్నట్లు ఒక అంచనా. పొగాకు కారణంగా క్యాన్సర్ బారిన పడిన వారి సంఖ్య కూడా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2022-23లో దీని కారణంగా 1729 మంది క్యాన్సర్ బారినపడితే, 2024- 25(ఇప్పటివరకూ) ఆ సంఖ్య 2564కు చేరింది.

జిల్లాలో పొగాకు వల్ల క్యాన్సర్ బారిన పడిన వివరాలు..

సంవత్సరం	బాధితులు
2022-23	1729
2023-24	2335
2024-25 నేటి వరకు	2564



గుండెకు ప్రధాన శత్రువు

గుండెపోటు కేసుల్లో 25 శాతం వరకు పొగాకే కారణమవుతోందని భావిస్తున్నారు. సిగరెట్ల సంఖ్య పెరిగేకొద్దీ గుండెజబ్బు ముప్పూ పెరుగుతోందని డాక్టర్లు చెబుతున్నారు. రోజుకు 20 సిగరెట్లు కాల్చేవారితో పోలిస్తే ఒకటి రెండు తాగేవారికీ గుండెపోటు ముప్పు 40-50 శాతం తక్కువగా ఉంటుందంటున్నారు. పొగాకులో నికోటిన్, విషతుల్యాలు రక్తనాళాలను దెబ్బతీసి పూడిక ఏర్పడుతుంది. పూడిక చిట్లిపోతే రక్తం గడ్డకట్టి నాళం మూసుకుపోయి గుండెపోటుకు దారితీస్తుంది. పొగ మూలంగా పెదవి, నోరు, నాలుక, జీర్ణాశయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, కాలేయం, మూత్రాశయం, కిడ్నీ క్యాన్సర్ల వంటివెన్నో తలెత్తుతాయి.

చట్టం ఏం చెబుతుందంటే...

చట్ట ప్రకారం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, మార్కెట్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, జనసంచార ప్రదేశాల్లో ధూమపానం నిషేధం. ఈ నిబంధన అతిక్రమించిన వారికి రూ.200 జరిమానాతో పాటు జైలు శిక్ష అమలుచేస్తారు. 18 ఏళ్ల లోపు వయసున్న వారికి పొగాకు ఉత్పత్తులు విక్రయించకూడదు. విద్యాసంస్థలకు వంద గజాల్లోపు వీటిని అమ్మడం నిషేధం. గుట్కా, ఖైనీ, పాన్, జర్దా వంటి పొగాకు వినియోగించే వారిలో అత్యధికులు 13 నుంచి 15 ఏళ్ల వయసున్న వారే ఎక్కువగా ఉన్నట్లు ఓ అధ్యయనంలో తేలింది.

డ్రగ్స్ నియంత్రణకు సమన్వయం ముఖ్యం

విద్యాసంస్థలో ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు

తిరుపతి (కలెక్టరేట్), మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటుచేయాలని సూచించారు. డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేయాలన్నారు. వారం రోజుల్లో డిఅడిక్షన్ సెంటర్‌లో వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఔషధనియంత్రణ అధికారులు సంయుక్తంగా మందుల దుకాణాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ వినియోగం, రవాణాపై నిఘాను పెంచి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 1972టోల్‌ఫ్రీ నెంబర్‌పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరా చేసేవారి వారి ఆస్తులను జప్తు చేస్తామని తెలిపారు. గంజాయి రవాణా హాట్ స్పాట్లను గుర్తించి నిఘా ఉంచామని తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల నిషేధం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఈవో కుమార్, ఆర్టీవో మురళీమోహన్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాధ, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు

శ్రీసిటీలో ముగిసిన వేసవి శిబిరం



విద్యార్థులతో శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు, శిక్షకులు

సత్యవేడు, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నలభై రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఏప్రిల్ 9 నుంచి ప్రారంభమైన శిబిరంలో 9వ తరగతితో పాటు టెన్త్, ఇంటర్ విద్యార్థులు 175 మంది హాజరయ్యారు. వీరికి స్పోకెన్ ఇంగ్లీష్, గణిత సూత్రాలు, బేసిక్ కంప్యూటర్ కోర్సు రాత నైపుణ్యాలు, పోటీ పరీక్షల మెలకువలు, జనరల్ నాలెడ్జి తదితర అంశాలను బోధించారు. యోగా, టెన్నిస్ తదితర క్రీడల్లో తర్ఫీదునిచ్చారు. క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ, ప్రాథమిక ఆరోగ్య చికిత్సల పట్ల ప్రత్యక్ష అభ్యసన ద్వారా అవగాహన కల్పించారు. తిరుపతిలోని జంతు సంరక్షణ కేంద్రం, సైన్స్ సెంటర్ క్షేత్ర పర్యటనలు, శ్రీసిటీలోని పెప్సీ, వైటల్ పేపర్స్ పరిశ్రమలు, నర్సరీ సందర్శనలకు తీసుకెళ్లారు. శ్రీసిటీ సీఎస్సార్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి ఈ కార్యక్రమాలను రూపొందించి మార్గనిర్దేశం చేశారు. కాగా వేసవి శిబిరానికి శిక్షకులుగా రజిత (క్రాఫ్ట్), దుష్యంత్ (పోటీ పరీక్షలు), ఉమా, నేహా (వ్యక్తిత్వ వికాసం), సాయిలక్ష్మి (ఇంగ్లీష్), సౌమ్య (కంప్యూటర్ కోర్స్), కోదండం (యోగా, కరాటే) వ్యవహరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు వేడుకల్లో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, శ్రీరామచంద్ర, మెడికల్ సెంటర్ డాక్టర్ సులోచన, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి


భార్య హత్య కేసులో భర్త అరెస్టు

నాయుడుపేట టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): భార్య హత్య కేసులో భర్తను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. నాయుడుపేట సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మీడియాకు వివరాలు వెల్లడించారు. నాయుడుపేట మండలం కాలవగట్టు సమీపంలో నివాసం ఉంటున్న మాణికల శ్రీనివాసులు, ఆయన భార్య కృష్ణవేణి ఈనెల 17వ తేదీన కూలి పనుల కోసం చిట్టమూరు మండలం గునపాడుకు వెళ్లారు. సాయంత్రం పని పూర్తయ్యాక భార్యభర్తలు ఇద్దరూ కల్లుతాగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో కృష్ణవేణి స్వర్ణముఖినదిలోకి దిగింది. అదే సమయంలో భర్త శ్రీనివాసులుతో చిన్నపాటి వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో శ్రీనివాసులు రాయితో తన భార్య ముఖంపై బలంగా కొట్టాడు. అప్పటికే ఆమెపై అనుమానం ఉండడంతో వదిలించుకోవాలని గొంతుపై కాలితో తొక్కి హతమార్చాడు. మృతురాలు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి వద్ద శ్రీనివాసులును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనపరచిన ఎస్ఐ ఆదిలక్ష్మి, సిబ్బంది పోలయ్య, దయాకర్, వెంకటేశ్వర్లును సీఐ అభినందించారు.

మేర్లపాక వద్ద టోల్‌గేట్ ప్రారంభం

ఏర్పేడు, మే 30(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై ఏర్పేడు మండలంలోని మేర్లపాక వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. దీన్ని శుక్రవారం నేషనల్ హైవేస్ పీడీ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. నిబంధనల మేరకు వాహనాల వద్ద రుసుం వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల శాఖ అధికారులు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్మశానం ఆక్రమణపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనలు

బాలాయపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నూరులోని గిరిజన శ్మశాన స్థలాన్ని జడపల్లి రమణయ్య అనే వ్యక్తి ఆక్రమించాడని, ఈ విషయంపై ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదంటూ యానాది సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యానాది సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లిఖార్జున్ మాట్లాడుతూ 80 ఏళ్లుగా గిరిజనులు వినియోగించుకుంటున్న శ్మశాన స్థలాన్ని ఆక్రమించడం దుర్మార్గమన్నారు. ప్రశ్నించిన గిరిజనలపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికి పట్టించుకోలేదన్నారు. ఆక్రమణ తొలగించాలని తహసీల్దార్‌కు పలుమార్లు మొరపెట్టుకున్నా రెవెన్యూ అధికారుల్లో చలనం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అడవయ్య, చిరంజీవి, వెలుగోటి రేవతి, పనబాకుల కల్పన, లక్ష్మయ్య, చిన్న అంకయ్య, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

టమోటాల వ్యాన్ బోల్తా



నాయుడుపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎంసీ గోదాముల వెనుక జాతీయ రహదారిపై టమోటాల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ బోల్తా కొట్టింది. శుక్రవారం మదనపల్లి నుంచి నెల్లూరుకు టమోటాల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ నాయుడుపేట సమీపంలోకి రాగానే వరహం అడ్డురావడంతో అదుపుతప్పిన పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. వ్యాన్‌లో ఉన్న కార్తీక్, వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు



జాతీయ రహదారిపై బోల్తాపడిన లారీ

పెళ్లకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు వద్ద జాతీయ రహదారిపై లారీ బోల్తా పడింది. తమిళనాడులోని రాణిపేట నుంచి ఏలూరుకు యూరియా లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ శేఖర్ శుక్రవారం తెల్లవారుజామున చిల్లకూరు వద్దకు వచ్చే సరికి నిద్రమత్తులోకి జారుకున్నారు. దీంతో లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కి గాయాలవడంతో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మునికుమారి

కోట, మే 30 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో మునికుమారి అన్నారు. మండల పరిధిలోని చిట్టేడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం క్లస్టర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ మహిళలు తమ పిల్లలను ప్రీ స్కూళ్లలో చేర్పించాలని కోరారు. బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంలో నాణ్యత లోపించకుండా పంపిణీ చేయాలన్నారు. నిబంధనలు పాటించని అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత, వర్కర్లు ఉన్నారు.

చిల్లకూరు: మండలంలోని బూదనం గ్రామంలో శుక్రవారం సీడీపీవోలు మెహబూబి, జ్యోతికిరణ్ ఆధ్వర్యంలో బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవోలు మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. మహిళలు ఉన్నత విద్య అభ్యసించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రేణుకమ్మ, సుమతి, ముత్యాలమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

'మై భారత్'ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): 'మై భారత్' పోర్టల్లో పేర్లు నమోదుచేసుకొని యువత కంప్యూటర్, అకౌంట్స్ మరియు ఫైనాన్స్, పరిపాలన, కమ్యూనికేషన్ స్కిల్స్, సైబర్ సెక్యూరిటీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఐటీ తదితరాలపై ఉచిత శిక్షణ పొందాలని సెట్విన్ సీఈవో కె.మోహన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం హెచ్‌టీటీపీఎస్://మైభారత్.జీఓవీ.ఇన్./యువ-రిజిస్టర్‌లో లాగిన్ కావాలని తెలియజేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్స్ అందజేస్తామని వివరించారు. 15సంవత్సరాలు పైపడినవారు అర్హులని తెలియజేశారు. ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్పొరేషన్ జట్టుపై జైసాప్ ఘన విజయం

తిరుపతి(క్రీడలు), మే 30(ఆంధ్రజ్యోతి): సీపీఎల్ సీజన్-1లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో కార్పొరేషన్‌పై జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జైసాప్) తిరుపతి జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జైసాప్ జట్టు నిర్ణీత 16ఓవర్లలో 141/4 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కార్పొరేషన్ జట్టు 97/7 పరుగులకే పరిమితమైన ఓటమి చెందింది. విజేత జట్టు ఆటగాడు శ్రీనివాసులు (35) పరుగులు సాధించడంతో పాటు బౌలింగ్‌లో 2వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు. కలెక్టర్ వెంకటేశ్వర్, సీడీసీఏ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ చేతులమీదుగా నగదు బహుమతి అందించారు.



కార్పొరేషన్ జట్టుపై విజయం సాధించిన ఆనందంలో జైసాప్ ఆటగాళ్ల

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఐదేళ్లు అధికారంలో ఉండి
చిన్న పనీ చేయలేకపోయాం!

- మీ హయాంలో అయినా అభివృద్ధి చేయండి
- ఎమ్మెల్యే ఎదుట వైసీపీ కౌన్సిలర్ల ఆవేదన



సమావేశంలో కౌన్సిలర్ రామకృష్ణ, కో అప్షన్ సభ్యుడు సునీల్ రెడ్డి వాగ్వాదం



తలపట్టుకున్న మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, కమిషనర్ చిన్నయ్య

సూళ్లూరుపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): పాలకవర్గం ఏర్పడి ఐదేళ్లు పూర్తి కావస్తోంది. మా పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు చిన్న పని కూడా చేయలేకపోయాం.. కనీసం మీ హయాంలోనైనా మున్సిపాలిటీని అభివృద్ధి చేయండమ్మా... అంటూ వైసీపీకి చెందిన కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుడు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. మొత్తం 30 అంశాలపై చర్చించారు. 28అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ముందుగా 8వ వార్డు కౌన్సిలర్, టీడీపీ నేత ఈదూరు చెంగమ్మ మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో రోడ్లు సక్రమంగా లేదని, ఈ విషయాన్ని ప్రతి సమావేశంలో ప్రస్తావిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే 9 వార్డు కౌన్సిలర్, వైసీపీ నాయకురాలు కడూరు లక్ష్మమ్మ మైక్ తీసుకుని నాలుగేళ్ల నుంచి ఏమి అభివృద్ధి జరిగింది.. ఏదైనా సమస్య చెబితే అధికారులు వస్తారు.. కొలతలు వేస్తారు... మళ్లీ దాని గురించి పట్టించుకోరు.. కనీస డ్రైనేజీ కూడా సక్రమంగా లేదు.. అధికారంలోకి ఉండి కూడా ప్రజలు అడిగిన పనులు చేయకపోయాం... మేమెందుకు కౌన్సిలర్లుగా ఉన్నామో మాకే అర్థం కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కో ఆప్షన్ సభ్యుడు కళత్తూరు సునీల్ కుమార్‌రెడ్డి జోక్యం చేసుకొని సభ్యులు చెప్పిదంతా నూటికి నూరుశాతం నిజమేనని, వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో చిన్నపాటి పనులు కూడా చేయలేదన్నారు. వీధిలైట్లు, డ్రైనేజీ కాలువలు, సిమెంటు రోడ్ల గురించి ఐదేళ్లుగా ప్రతి సమావేశంలో అడుగుతున్నా పట్టించుకోలేదని, ప్రజల ముందు తిరగలేకపోతున్నామని వాపోయారు. ప్రజలు మీపై నమ్మకంతో గెలిపించారు.. మీ ప్రభుతంలో నైనా మున్సిపాలిటీని అభివృద్ధి చేయండమ్మా... మేము పూర్తిస్థాయిలో సహకరిస్తాం.. అని సునీల్ కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి విజ్ఞప్తి చేశారు. వైసీపీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల కొన్నివార్డుల్లో పనులు ఆగిపోయాయని, దానికి గత ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. వైసీపీకి చెందిన 18 వార్డు కౌన్సిలరు జనార్దన్ జోక్యం చేసుకుంటూ కాంట్రాక్టర్లు ఎందుకు పనులు చేయలేదని, ఐదేళ్ల నుంచి ఇదేపాట పాడితే ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. అసలు ఏమైనా పనులు చేసివుంటే కదా చెప్పుకోవడానికి, ప్రజల ముందుకెళ్లేందుకు సిగ్గుగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ కౌన్సిలర్ల నడుమ కొంతసేపు వాదనలు జరిగాయి. వారిని సముదాయించేందుకు చైర్మన్ ప్రయత్నించినా.. ఇంకో ఐదు నెలల్లో పదవీకాలం ముగుస్తుంది... ఇక చేసేదే ముంది... తమ రాజకీయ జీవితం అంతా నాశమైపోయిదంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో శ్రీమంత్‌రెడ్డి తలపట్టుకున్నారు. ఇంతలో వైస్‌చైర్మన్ చిన్నసత్యనారాయణ, కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి సమావేశం నుంచి వెళ్లిపో తుండడంతో ఇదేం పద్ధతి అంటూ ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో రూ.2 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపడతామని, అందరూ సమన్వయంతో పనిచేస్తూ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో కమిషనర్ చిన్నయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతో వ్యాధులు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జితేంద్ర

పెళ్లకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) జీవనశైలి మార్పుతో ఆరోగ్యంగా ఉండవచ్చని పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సుజాతమ్మ, జితేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చిల్లకూరు విలేజ్ క్లినిక్ సెంటర్‌లో బీపీ, షుగర్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఉరుకులు, పరుగుల జీవనంలో ప్రజలు అనేక రోగాల బారీన పడుతూ ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. జీవనశైలి మార్పుతో పాటు శారీరక శ్రమ లేకపోవడం, మద్యపానం, ధూమపానం, వంశపారంపర్యం తదితర కారణాలతో వ్యాధులు వస్తున్నాయన్నారు. శారీకర శ్రమతో పాటు సమతుల ఆహరం తీసుకోవాలన్నారు. 30 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తరచూ వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ వినయ, ఏఎన్ఎం భూలక్ష్మి, సిబ్బంది కోగిలి ధనమ్మ, కట్టా ధనమ్మ, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణను అడ్డుకోండి

గూడూరు అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్నూరు గ్రామంలో ఎస్టీ కాలనీ నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే దారిని కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దారి ఆక్రమిస్తే అవస్థలు పడాల్సివస్తుందని, అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తడలో మోస్తరు వర్షం

తడ, మే 30 (ఆంధ్రజ్యోతి): తడ మండలంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. మాంబట్టు, వెండ్లూరుపాడు, చేనిగుంట, అక్కంపేట, అండగుండాల పంచాయతీల్లో వర్షం పడింది.

ఎలక్ట్రానిక్ కాటాల తనిఖీ



డీలర్ల ఈ పాస్ యంత్రాలను పరిశీలిస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

కోట, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం చౌకధరల దుకాణాల ఈ పాస్ మిషన్లు, ఎలక్ట్రానిక్ కాటాలను తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేశారు. లీగల్ మెట్రాలజీ సీనియర్ అసిస్టెంట్ బాబుసాహేబ్, ఈ పాసింగ్ ఇంజనీర్ వీరేంద్ర కుమార్ మండలంలోని 33 చౌకదుకాణాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ కాటాల్లో తేడాలను గుర్తించి సరిచేశారు. ప్రభుత్వం సరఫరా చేసే సరుకుల కొలతల్లో తేడాలు రాకుండా డీలర్లకు అవగాహన కల్పించారు.

రాజరాజేశ్వరిదేవి ఆలయంలో పూజలు



ఆలయ ఆవరణలో పూజలు చేస్తున్న భక్తులు

గూడూరు అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజరాజేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు రాహుకాల పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటమ్మకు ప్రత్యేక అలంకారం

కోట, మే 30 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు కనకాంబరాలు, కాగడాలు, మల్లెపూలు, గాజులతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

బస్టాండులో తప్పిపోయిన బాలిక
అనాథ ఆశ్రమానికి అప్పగింత



తప్పి పోయిన బాలిక

తిరుపతి(నేరవిభాగం) మే 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్టీసీ బస్టాండులో తప్పిపోయిన బాలికను పోలీసులు శుక్రవారం స్థానిక మహిళా ప్రాంగణంలో అప్పగించారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... బస్టాండులో బాలిక ఏడుస్తూ ఉండగా ప్రయాణికులు గమనించి అక్కడ వున్న అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. వారు బాలికను విచారించగా పల్లెటూరు అని తెలియజేసింది. తల్లి, తండ్రి పేర్లు చెప్పడానికి సంకోచిస్తోంది. దీంతో బాలికను మహిళా ప్రాంగణంలో అప్పగించారు. స్థానిక శిశు విహార్‌లో అప్పగించారు. బాలిక ఎక్కడ నుంచి అయినా వచ్చి బస్టాండులో తప్పిపోయిందా లేక ఎవరైనా వచ్చి వదిలేసి వెళ్లారా అనే కోణంలో విచారణ చేపట్టారు. బాలిక వివరాలు తెలిసిన వారు తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు 94407 96748కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

పేదలకు దుప్పట్లు, దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు, దుప్పట్లు అందజేస్తున్న పెంచలనాయుడు

గూడూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగం థియేటర్ సెంటర్ వద్ద శుక్రవారం భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా సంస్థ ఉపాధ్యక్షుడు కంకణాల పెంచల నాయుడు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక ప్రిన్సిపల్ సెక్రటరీ రోహిణి సింధూరి పుట్టినరోజు సందర్భంగా పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశామన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

కోట, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం, మద్దాలి, చిట్టేడు, ఊనుగుంటపాళెం, రుద్రవరం, సిద్దవరం, ఉత్తమ నెల్లూరు గ్రామాల్లో ఉన్న రేషన్ దుకాణాలను శుక్రవారం తహసీల్దార్ జయజయరావు తనిఖీ చేశారు. జూన్ 1నుంచి ప్రభుత్వం అందించే బియ్యం, నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో దుకాణాలను తనిఖీ చేసి డీలర్లకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, వీఆర్‌ఓలు పోలయ్య, శ్రీనివాసులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద రేషన్ డీలర్ల ఈ - పాస్ యంత్రాలు, కాటాలను తూనికల కొలతల శాఖ అధికారి వీరేంద్రకుమార్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీటీ సందీప్, ఆర్ఐ అఖిల్, సివిల్ సప్లయ్ డీటీ మల్లికార్జున్‌రావు, పౌరసరఫరాల గోదాము ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

వెంకటగిరి టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొక్కలపాడు గ్రామంలో సీడీపీవో షంషాద్ బేగం ఆధ్వర్యంలో కిశోర వికాసం వేసవి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, పొదుపు సీసీ, బాలికలు పాల్గొన్నారు.

విష్ణునివాసం వద్ద భద్రత మరింత పటిష్ఠం
అదనంగా 13 సీసీ కెమెరాలు ఏర్పాటు



విష్ణునివాసం వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ

తిరుపతి(నేరవిభాగం) మే 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విష్ణునివాసం వద్ద భద్రత పటిష్ఠం చేశారు. ఈ నెల 30న ఆంధ్రజ్యోతిలో 14 రోజులు.... తొమ్మిది చోరీలు అనే శీర్షికన ఇటీవల జరిగిన వరుస ఘటనలపై ప్రచురితమైన కథనంపై ఎస్పీ హర్షవర్ధనరాజు స్పందించారు. విష్ణునివాసం విచారణ చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని డీఎస్పీ భక్తవత్సలాన్ని ఆదేశించారు. దీంతో శుక్రవారం డీఎస్పీ, సీఐ శ్రీనివాసులు, ఏవీఎస్‌వో మోహన్‌రెడ్డి, విజిలెన్సు సిబ్బంది, ఎస్ఐలు, పోలీసులు విష్ణునివాసం వద్దకు వెళ్లి తనిఖీలు చేశారు. పది మంది అనుమానితు లను అదుపులోకి తీసుకుని వేలిముద్రలు సేకరించారు. విలువైన వస్తువులకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భక్తులకు అవగాహన కల్పించారు. అదనంగా 10 మంది విజిలెన్సు సిబ్బందిని నిఘా కోసం నియమించారు. 13 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా మరో 200 కెమెరాలు ఏర్పాటు చేయడానికి టీటీడీకి ప్రతిపాదనలు పంపామని డీఎస్పీ భక్తవత్సలం చెప్పారు. ప్రతి రోజూ అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు నిత్యం పోలీసులు, విజిలెన్సు సిబ్బంది తనిఖీలు చేస్తారని వివరించారు.

మృతదేహాల అప్పగింత



ఆస్పత్రి పోస్టుమార్టం గది వద్ద మృతుల కుటుంబసభ్యులు

నాయుడుపేట టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ లాడ్జీలో దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం గ్రామానికి చెందిన మణి, శిరీషా అనుమానాస్పద స్థితిలో గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయ్యాక కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. మణి గొంతు 90శాతం తెగిపోయి ఉండటంతో లాడ్జీలో గదిని అణువణువూ గాలించారు. ఓ బ్లేడ్ లభ్యమైంది. గురువారం ఉదయం 9 గంటల సమయంలో శిరీషా మాత్రమే రూంలో నుంచి కిందకు వెళ్లి కొంత సమయం తరువాత గదిలోకి వెళ్లినట్లు లాడ్జీ సిబ్బంది పోలీసులకు తెలిపారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించడంతో రికార్డింగ్ లభించలేదు. లాడ్జీ సిబ్బందిని ప్రశ్నించగా ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేదని చెప్పారు. బుధవారం రాత్రి మృతులిద్దరూ లాడ్జీలో గది తీసుకోకముందు నిలబడి గోడవ పడినట్లు స్థానికులు చెబుతున్నారు. మణి ఎలా మృతి చెందాడు? శిరీషా ఎందుకు ఉరివేసుకొని మృతి చెందిందన్న విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఆధార్ సేవల కోసం జనం పాట్లు



ఆధార్ కోసం ఎంపీడీవో కార్యాలయం బయట నిరీక్షిస్తున్న జనం

వెంకటగిరి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలు ఆధార్ సేవలు అందక నానాపాట్లు పడుతున్నారు. పట్టణంలోని గ్రామీణ బ్యాంకు, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ బ్యాంకు ఆధార్ కేంద్రం వారం రోజులుగా పనిచేయడంలేదు. దీంతో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న ఆధార్ కేంద్రమే ప్రజలందరికీ దిక్కుగా మారింది. అందరూ అక్కడికే వెళ్తుండడంతో తరచూ సర్వర్ సమస్య తలెత్తుతోంది. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించాల్సి వస్తోందని, ఒక్కోరోజు పూర్తిగా సర్వర్ సనిచేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని పనులు వదులుకుని పడిగాపులు కాసినా ఫలితం లేకుండా పోతోందన్నారు. అధికారులు స్పందించి మరో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాదలూరులో సివిల్ రైట్స్ డే



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దారు శరత్‌బాబు

తడ, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాదలూరులో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దారు శరత్‌బాబు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు కార్డుల్లో చేర్పులు, మార్పులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి మస్తాన్, సీనియర్ అసిస్టెంట్ వనజ, టీడీపీ నాయకుడు వేలూరు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

భాకరాపేట, మే 30(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు జగనన్న కాలనీ సమీప జీడి బండల ప్రాంతంలోని మామిడితోటలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. చిన్నగొట్టిగల్లుకు చెందిన పశువుల కాపర్లు శుక్రవారం మామిడి తోటలో మృతదేహాన్ని గుర్తించి సమారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతదేహం బాగా కుళ్లి పోవడంతో గుర్తుపట్టలేని విధంగా ఉంది. బ్లూ కలర్ గీతల షర్టు, లుంగీ ధరించి ఉన్నాడు.